పీఆర్ ఎస్ఈగా మహ్మద్ ఆలీముల్లా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ జిల్లా అధికారి(ఎస్ఈ)గా మహ్మద్ ఆలీ ముల్లా నియమితులయ్యారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఎస్ఈగా పనిచేసిన ఏబీవీ ప్రసాద్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో కృష్ణా జిల్లా నుంచి బదిలీపై ఆలీముల్లా వచ్చారు. ఈ మేరకు సిబ్బంది అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మిడ్ డే మీల్స్ కార్మికుల ధర్నా



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సందర్భంగా జగన్ ఇచ్చిన రూ.10వేల వేతన హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాల యం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసనకు దిగారు. ఎన్ని సార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.ఎండీఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిట్టా బేబీ, ఎల్లారీశ్వరి మాట్లాడు తూ ఎండీఎం కార్మికులకు ఉద్యోగ భద్రత కూడా లేదన్నారు. నిత్యావసర ధరలు విప రీతంగా పెరి గినా గౌరవ భృతి రూ.3వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. విద్యార్థికి రూ.20చొప్పున మెనూ చార్జీలు ఇస్తేగానీ వండి పెట్టడం సాధ్యం కాదన్నారు.సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందర బాబు, బి.రాజులోవ మాట్లాడుతూ తనిఖీలకు వస్తున్న వాళ్లు కూరగాయల ధరలు, నిత్యావసరాల రేట్లు, మెనూ చార్జీలు తక్కువగా ఉండడం, బిల్లుల ఆలస్యం వంటి విషయాలు పక్కనపెట్టి వంటకు వంకలు పెట్టే పనిలో ఉంటున్నారన్నాని విమర్శించారు.కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.అన్నామణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రాజా మద్దతు పలికారు.

ఇన్‌చార్జి డీపీవోగా రాంబాబు బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లు దాటి సొంత జిల్లాలో పనిచేస్తున్న, జిల్లా, మండల స్థాయి అధికారులను ఎన్నికల నిర్వహణలో భాగంగా సీఈవో ఆదేశాల మేరకు బదిలీ చేశారు. జిల్లా ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న జానా సత్యనారాయణను బాపట్లకు బదిలీ చేశారు. కర్లపాలెం ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న దాసరి రాంబాబును తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి డీపీవోగా నియమించారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రిజిస్ట్రేషన్లకు సర్వర్ కష్టాలు

నిడదవోలు, ఫిబ్రవరి 5 : జిల్లావ్యాప్తంగా సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో సాంకేతిక సమస్యలతో సర్వర్ పనిచేయకపోవడంతో తరచుగా రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా పాలకులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేకపోతున్నారు. నిడదవోలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో సోమవారం సర్వర్ సాంకేతిక సమస్య కారణంగా రిజిస్ట్రేష న్లు నిలిచిపోయాయి. ఈ నెలలో ఫిబ్రవరి 2వ తేది జిల్లా వ్యాప్తంగా సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోగా తిరిగి సోమవారం 5వ తేది మళ్లీ సర్వర్ సమస్యలు ఉత్పన్నమై రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సర్వర్ సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో సబ్ రిజిస్ట్రారు కార్యాలయ అధికారి వి.వెంకటేశ్వర్లు, సిబ్బంది, కక్షిదారులు సాయంత్రం వరకు ఎదురుచూశారు. అయినా లాభం లేకపోయింది.



నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారులు



ఏపీ ఎన్‌జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత

ఉద్యోగులకు ఎన్నికల విధులు

- నేటి నుంచి పీపీఎంఎస్ పోర్టల్‌లో డేటా ఎంట్రీ
- ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు లేదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమగ్ర డేటాను ప్రభుత్వ పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(పీపీఎంఎస్)లో తప్పని సరిగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని అన్ని శాఖల డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ (డీడీవో) అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌తో కలిసి ఆమె సమీక్షించారు. కొత్త జిల్లా పరిధిలో త్వరలో నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియను సజావుగా సాగించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల విధి నిర్వహణ విషయంలో ఎటువంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ కోసం ప్రిసైడింగ్,పోలింగ్ అధికారులను నియమిస్తామన్నారు. ప్రతి డీడీవో వారి పరిధిలోని ఆయా క్యాడర్‌లో పనిచేసే ఉద్యోగుల వివరాలు పీపీఎంస్ సాఫ్ట్‌వేర్‌లో క్రోడీకరించి ధ్రువీకరించాలన్నారు. ప్రతి అధికారి అందించిన సమాచారాన్ని ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు పీపీఎంఎస్‌లో అప్‌డేట్ చేసిన తర్వాత ర్యాండమైజేషన్ పద్ధతిలో ఎన్నికల విధుల కేటాయింపు ఉంటుందన్నారు.మహిళా ఉద్యో గులకు వారు పని చేసే ప్రాంతానికి అనుగుణంగా కేటాయింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.జిల్లాలో సుమారు 10 వేల మంది డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు.ఓటరు గుర్తింపు కార్డు వివరాలు నమోదు చేయాలని చెప్పారు.కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి 15 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఈ ప్రక్రియ చేపట్టినట్టు తెలిపారు. ట్రెజరీ శాఖ సీఎఫ్ఎంఎస్ డేటాకి అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వర్తిం చేవారిని గుర్తిస్తామని తెలిపారు. అధికారులకు రోజువారి డేటా ఎంట్రీ కోసం ఏ స్లాట్ ఇచ్చామో తెలియజేస్తామన్నారు.కలెక్టరేట్‌లో ఏపీఎన్జీవో రాజమహేంద్రవరం నగర శాఖ ప్రచురించిన ఉద్యోగుల కాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో జి.నరసిం హులు, కెఆర్ఆర్‌సీ ఎస్‌డీటీ కృష్ణనాయక్, సీపీవోఎల్ అప్పలకొండ, మాస్టర్ ట్రైనర్ ఎస్ఐసీ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్‌ల వేతనాలపై నిర్ణయం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఆర్ రోజువారీ వేతనాలను నిర్ణయిస్తూ కలెక్టర్ మాధవీలత ఆదేశాలిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికులకు నైపుణ్యం కలిగిన వారికి రోజుకు రూ.827, సెమీ స్కిల్డ్ రూ.687, నైపుణ్యం లేనివారికి రూ.560 చొప్పున చెల్లించాలన్నారు. ఈ వేతనాలు 1.4.2023 నుంచి 31.3.2024 వరకూ అమలులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ, పీఆర్ ఎస్ఈ మహ్మద్ ఆలిముల్లా, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అధరహో!

ఖోఖో గింజల ధర కేక

- కేజీకి రూ.110 పెరుగుదల
- ప్రస్తుతం కేజీ రూ. 350
- గతేడాది రూ. 240
- మరింత పెరిగే అవకాశం
- రైతాంగం ఆనందం
- దిగుబడులు తగ్గడమే కారణం
- జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు
- అనుకూలించని వాతావరణం
- పూత తగ్గిందంటున్నరైతాంగం

పెరవలి,ఫిబ్రవరి 5 : ఖోఖో ధర కేక పెడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పెరగడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. కొబ్బరి తోటలు, పామాయిల్ తోటల్లో అంతర పంటగా జిల్లావ్యాప్తంగా వందలాది ఎకరాల్లో ఖోఖో సాగు చేస్తున్నారు.గతేడాది కేజీ ఖోఖో గింజలు ధర రూ. 240ల వరకు పలకగా ఈ ఏడాది రూ.350లు పలుకుతోంది. రాబోయే రెండు, మూడు నెలల్లో ఈ ధర మరింత పెరగవచ్చునని కూడా చెబుతున్నారు. నాలుగేళ్ల కిందట వరకు రూ.200 లోపు మాత్రమే ధర పలికేది. క్రమక్రమంగా పెరిగి గతేడాది 240 రూపాయలకు చేరుకుంది. గతంలో ఎపుడూ ధర పెరిగిన కేవలం రూ.10 నుంచి రూ. 20 మాత్రమే పెరిగేది. ప్రస్తుతం అలా కాకుండా రూ.50 రూపాయలు చొప్పున పెరుగుతూ వచ్చింది. దీనికి కారణం గత రెండు, మూడు నెలల్లో వచ్చిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో పాటు సరైన దిగుబడిలేక డిమాండ్ పెరిగినట్టు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుత వాతావరణం పరిస్థితుల వల్ల ఖోఖో తోటల్లో పూత దెబ్బతిని ప్రస్తుతం కాపు తగ్గిందని చెబుతున్నారు. సాధారణంగా ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. కొన్ని చోట్ల మాత్రం 6 నుంచి 7 క్విం టాళ్ళ వరకు వస్తుంది. ప్రస్తుతం మారిన పరిస్థితుల వల్ల ఎకరాకు 2.30 క్వింటాళ్ళ నుంచి 3 క్వింటాళ్ళు మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. డిమాండ్ తగిన దిగుబడి లేకపోవడంతో ఒక్కసారిగా ధర పెరి గింది. అంతే కాకుండా ఖోఖో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు వద్ద నిల్వలు లేక ధర పెంచినట్టు చెబుతున్నారు. స్థానికంగా గింజలు కొనుగోలు చేసే క్యాడ్‌బరి కంపెనీకి చెందిన మాండెలిజ్ కంపెనీ గతేడాది జనవరి నెలలో 180 టన్నులు కొనుగోలు చేయగా ప్రస్తుతం 80 టన్ను లు మాత్రమే కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. ధర పెరిగినప్పటికి దిగుబడి తగ్గి రైతుల్లో కొంత నిరాశ కలుగుతుంది.దీంతో ఖోఖో పంటపై రైతు ల్లో ఆశలు చిగురుస్తున్నాయి. కొబ్బరిలో అంతర పంటగా జిల్లాలో అరటి, కూరగాయలు వంటివి పండిస్తుంటారు. గత పది పదిహేను సంవత్సరాలుగా ప్రభుత్వ పోత్సాహం వల్ల ఖోఖో పంటను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరానికి కొబ్బరి కాయలు దిగుబడితో పాటు అదనంగా ఖోఖో గింజల ఆదాయం కూడా వస్తుండడంతో ఎక్కువ మంది రైతులు ఖోఖో పంటలు వైపు మొగ్గు చూపారు. అయితే ప్రస్తుత ధర ప్రభావం కారణంగా మరింత మంది రైతులు ఖోఖో సాగులో దిగేందుకు సన్నద్ధమవుతున్నారు.

నిరంతరం డిమాండ్..

ఖోఖో గింజలకు డిమాండ్ లేకపోవడం అంటూ ఏమీ ఉండదు. గత కరోనా సమయంలో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఖోఖో గింజల అమ్మకాలు సాగాయి. ఖోఖో గింజలు ద్వారా పిల్లలు ఎంతో ఇష్టంగా తినే చాక్లెట్స్ తయారవుతాయి. అదేవిధంగా ఖోఖో పౌడర్, ఖోఖో మిల్క్, బార్నవిటా, బూస్ట్ తదితర ఉత్పత్తులు ఖోఖోగింజల ద్వారా తయారవుతుంటాయి. అంతే కాకుండా ధరలేకపోతే ఆరబెట్టిన ఖోఖో గింజలను రైతులు రెండు మూడు నెలలు పాటు నిల్వ చేసుకునే సౌలభ్యం ఉంది. దీంతో ఎక్కువ రైతులు ఈ పంట వైపు మొగ్గుచూపుతున్నారు.

దిగుబడి తగ్గి.. పెరిగిన ధర



గతేడాది కేజీ రూ.240లు ధర పలికిన ఖోఖో ఈ ఏడాది ప్రస్తుతం రూ.350కు చేరుకుంది. ఈ ఏడాది దిగుబడి తగ్గడమే ధర పెరుగుదలకు కారణం. రైతులు ఖోఖో పంట వేసుకోవాలని కంపెనీలు పోత్సహిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా మిగిలిన పంట కంటే ఖోఖో పంట గల రైతుల పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

- సుబ్రహ్మణ్యం, కొనుగోలు కంపెనీ ప్రతినిధి

ప్రస్తుతం కాపు తక్కువ..



రెండెకరాల చేలో ఖోఖో పండిస్తున్నా. ఎకరానికి 4 క్వింటాళ్ళ వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం తోటల్లో కాపు తక్కువగా ఉంది. దిగుబడి ఎంత వస్తుందనేది మే నెలాఖరు నాటికి కాని తెలియదు. అయినప్పటికి ఖోఖోగింజల రేటు పెరగడం ఆనందం కలిగిస్తుంది. ఖోఖో తోట వేయడానికి ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి.

- నందమూరి రామారావు, రైతు, తీపర్రు

విజిలెన్స్ ఎస్పీగా సుబ్బారెడ్డి బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ ఎస్పీగా కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రభుత్వానికి రావాల్సిన రెవెన్యూ వసూళ్లలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం, పథకాల అమలులో అవినీతి వంటి వాటిపై దృష్టి సారి స్తామన్నారు.డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తహశీ ల్దారు విజయ్‌కుమార్, ఏవో భార్గవ మహేశ్, ఏజీ లక్ష్మీనారాయణ, సూప రింటెండెంట్ మునిబాబు అభినందనలు తెలిపారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ మాధవీలత,జేసీ తేజ్‌భరత్

కలెక్టర్ స్పందనకు 174 అర్జీలు

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి 5 : స్పందనలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో కలెక్టర్ డాక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ , డీఆర్వో జి.నరసింహులు జిల్లా అధికారులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం స్పందనకు 174 అర్జీలు అందాయి. ఆన్‌లైన్‌లో 151, ఆఫ్‌లైన్‌లో 23 అర్జీలు ఉన్నాయి. మండపేటకు చెందిన ఎస్.పురుషోత్తమరావు తన కుమార్తె శ్వేతహాసిని పేరున జి.ఎర్రంపాలెంలో వ్యవసాయ భూమి ఉందని అయితే నెక్కంటి విశ్వేశ్వరరావు అనే వ్యక్తి పేరున తన కుమార్తె పేరున ఒకే ఎల్‌పీ నెంబరు జారీ అయ్యిందని దానిని సరి చేయాలని కోరాడు. రాజమహేంద్రవరానికి చెందిన గన్నమ్మ సరిహద్దు తగాదా సరిచేయాలని వేడుకుంది. లంక భూములు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు తదితర సమస్యలు పరిష్కరించాలని అర్జీలను పెట్టుకున్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీశ్

ఎస్పీ 'స్పందన'కు 31 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జాప్యం లేకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. అర్జీదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యను తెలుసుకు న్నారు. వర్చువల్ విధానంలో ఆయా స్టేషను బాధ్యులు, డీఎస్పీలతో ఫిర్యాదుదారుల సమక్షంలోనే మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. సివిల్, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాటలు తదితర 31 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. చట్ట పరిధిలో సాధ్యమైనంత త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మూడో పట్టణ పోలీస్ స్టేషను పరిధి కృష్ణానగర్‌లో తాము అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని అద్దె విషయంలో తనపై దాడి చేశాడని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. తన 19 ఏళ్ల కుమారుడు 2022లో తప్పిపోగా ఇప్పటి వరకూ కేసులో పురోగతి లేదని కడియం పోలీస్ స్టేషను పరిధి లోని జేగురుపాడుకు చెందిన ఓ వ్యక్తి ఎస్పీకి విన్నవించారు. తనపై హత్యాయత్నం చేశారని బొమ్మూరు పీఎస్ పరిధిలోని హుకుంపేట గ్రామానికి చెందిన ఓ మహిళ, తన వద్ద అప్పుగా తీసుకున్న సొమ్ము తిరిగి ఇప్పించాలని ధవళేశ్వరం పీఎస్ పరిధిలోని రాజవోలుకు చెందిన ఓ వ్యక్తి, అదనపు కట్నం కోసం తనను కుటుంబీకులు వేధిస్తున్నారని కోరుకొండ పీఎస్ పరిధిలోని ఒక మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.ఏఎస్పీ(పరిపాలన) రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.



పులి దాడిలో మృతిచెందిన పందికి సంబంధించి రైతుకు పరిహారం అందజేస్తున్న అటవీ అధికారులు.. దాడి చేసిన పులి

కన్నాపురం అటవీ ప్రాంతం వైపు

పెద్ద పులి పాదముద్రలు

- పాపికొండల అభయారణ్యంలోకి వెళ్లే అవకాశం
- 9 గంటల వరకూ పొలం పనులకు వెళ్లవద్దని సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే : అటవీ అధికారి

గోపాలపురం, ఫిబ్రవరి 5 : పెద్దపులి ప్రస్తుతం గోపాలపురం మండలం కరగపాడు అటవీప్రాంతం నుంచి ఏలూరు జిల్లా కొవ్వాడ రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ప్రవేశించిందని రాజమహేంద్రవరం అటవీశాఖాధికారి ధనరాజు తెలిపారు. గోపాలపురం మండలం కరగపాడు అటవీ ప్రాంతంలో పందిపై దాడి చేసిన ప్రాంతాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం పెద్దపులి పాదముద్రలు కన్నాపురం అటవీప్రాంతం వైపు ఉన్నాయన్నారు. అటు నుంచి పాపికొండల అభయారణ్యంలోకి పులి చేరవచ్చని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కొన్ని రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం 9 గంటల వరకు పొలం పనులకు వెళ్లవద్దని సూచించారు.పొలంలోని పశువులను ఇళ్ళ వద్దకు తీసుకురావాలని 5గంటలు దాటిన తరువాత ప్రజలు ఇళ్ళకే పరిమితం కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పులిదాడిలో చనిపోయిన పందికి సంబంధించి రైతుకు నష్టపరిహారం కింద రూ.4 వేలు అందజేశారు. చనిపో యిన పందికి అంత్యక్రియలు జరిపించినట్టు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ ఆర్వో వేణుగోపాల్, ఎఫ్‌డీవో కార్తీక్ తదితరులు ఉన్నారు.



చెట్టుకు.. చేటు : చిడిపి గోదావరి లంకలో ముక్కలైన భారీ వృక్షాలు

తవ్వేయ్.. నరికెయ్!

చిడిపి గోదావరి లంకలో మట్టి.. చెట్లూ మాయం

కొవ్వూరు, ఫిబ్రవరి 5 : అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు.. ఎవరైనా వస్తే రానీ మామూళ్లిస్తాం.. మాట్లాడి పంపిస్తాం.. ఇదీ వైసీపీ ప్రభుత్వంలో చాలా మంది నాయకుల తీరు.. దర్జాగా అక్రమార్జనకు తెగబడుతున్నారు.. అధికారుల అండదండలతో ఎటువంటి భయమూ లేకుండా పగలూ రాత్రీ కూడా తాము అనుకున్నది చేసేస్తున్నారు. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. కొవ్వూరు మండలం చిడిపి గ్రామ రెవెన్యూ పరిధిలో అఖండ గోదావరి మధ్య లంకలలో చాలా ఏళ్లగా విలువైన మట్టి, కలప ఉంది. గతంలో ఆ ప్రాంతంలో అడుగుపెట్టాలంటేనే భయపడేవారు. అటువంటిది నేడు ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలించుకుపోతున్నారు.. చెట్లను కొట్టుకుపోతున్నారు. అయినా అడిగే నాథుడు లేడు.. ప్రశ్నించే పాలకుడు లేడు. గోదావరి మధ్య భాగంలో సుమారు 200 ఎకరాల లంక భూమి ఉంది. 2023 నవంబరులో చిడిపి గ్రామ దళితులకు ఒక్కొక్కరికి 65 సెంట్లు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం లీజుకు పట్టాలు మంజూరు చేసింది. ఆ భూములను ఆనుకుని ఇంకా మిగిలి ఉన్న 140 ఎకరాల లంకభూమిలో వేమ, చీమచింత, తుమ్మ జాతికి చెందిన పెద్దపెద్ద వృక్షాలు ఉన్నాయి. ఆ భూముల్లో మట్టిని వ్యవసాయ భూములు మెరక చేసుకోవడానికి, ఇటుక బట్టీలకు విక్రయించి అక్రమార్జన చేస్తున్నారు. చెట్లను నరికివేసి ట్రాక్టర్లలో స్మగ్లింగ్ చేస్తూ లక్షలాది రూపాయలు ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నారన్నారు. దళితులకు చెందిన లంకభూముల్లో మట్టి, కలపను (అటవీ శాఖ, నీటిపారుదల, రెవెన్యూ, గనులు, పర్యావరణ శాఖల) అనుమతులు లేకుండా దోచుకుంటున్నారు. అక్రమంగా చెట్లు నరికి అక్రమార్జన చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చిడిపి గ్రామస్తులు జిల్లా కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో చిడిపి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కవల శ్రీనుబాబు, కొయ్య వెంకట్రావు, డి.వెంకటరత్నం, కె. దుర్గాప్రసాద్ సోమవారం జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.

వైసీపీ నాయకులు..అధికారుల దందా?

గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పామెర్ల నగేష్, అఖండ గోదావరి కుడిగట్టు విభాగం (ఏజీఆర్‌బీ) ఏఈ సునీల్‌కుమార్ కుమ్మక్కై లంకభూములలో ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను నరికి అక్రమంగా కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. కోట్లాది రూపాయలు ప్రభుత్వ సంపదను కొల్లగొడుతూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ఇరువురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అఖండ గోదావరి కుడిగట్టు విభాగం(ఏజీఆర్‌బీ) ఏఈ సునీల్‌కుమార్‌ను ప్రశ్నించగా దళితులు జంగిల్ క్లియరెన్స్ చేసుకుంటున్నారని చెప్పడం గమనార్హం.

గిరిజన సంప్రదాయ నృత్యాలు



డప్పు వాయిద్యాల సందడి



వైభవంగా గిరిజనోత్సవం







కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న రిజిస్ట్రార్ తదితరులు

- నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో జాతీయ స్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు
- విశేషంగా ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ నృత్యాలు
- డప్పు వాయిద్యాలతో మార్మోగిన ప్రాంగణం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 5: సంస్కృతి, సంప్రదాయాలు, సంస్కారాలు గిరిజనుల వారసత్వ సంపద అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్సిటీ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మరో ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు కళలలోనే సమాజ వికాసం ఇమిడి ఉంటుందన్నారు. టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు రెండు రోజులపాటు జరుగుతాయని, ఏపీతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కళాకారులు వచ్చారన్నారు. కళాకారులు ధింసా, తప్పెటగుళ్లు వంటి 35 గిరిజన కళారూపాలను ప్రదర్శిస్తారన్నారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలో అంతరించిపోతున్న జాతుల్లో ముఖ్యంగా గిరిజన జాతి ఉందని, ఈ ఆదివాసీ ఆచార సంప్రదాయాలు, కళలను కాపాడుకోవలసిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని కోరారు. తమ సంప్రదాయ నృత్యాలు, కళలను కాపాడుకునే సమష్టి బాధ్యతలో భాగంగానే ఈ ఉత్సవాలు ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన జాబితాలో ఇతర కులాలను చేర్చాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నన్నయ వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఐఎస్టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కె.ఉపేంద్రరెడ్డి, టీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.విష్ణునాయక్, తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌నాయక్, నాయకులు రాజకుమార్‌రెడ్డి, భగవాన్, వెస్లీ, రఘు, రామరాజు, వెంకటేష్, వెంకటేశ్వర్లు నాయక్, రఘునాథ్‌నాయక్, మల్లేష్ పాల్గొన్నారు. ఈ ప్రదర్శనల్లో కొందరు విశ్వవిద్యాలయ అధికారులు కూడా కొద్దిసేపు కళాకారులతో కలిసి నృత్యాలు చేశారు. తొలుత యూనివర్సిటీ ప్రధాన ద్వారం నుంచి సభ జరిగే భవనం వరకూ కళారూప ప్రదర్శనలతో ఊరేగింపు నిర్వహించారు.



ధగధగ

రత్నగిరిపై శంఖుచక్రాలు, నామం ఏర్పాటు

అన్నవరం, ఫిబ్రవరి 5: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో 42 అడుగుల పొడవు, 90 అడుగుల వెడల్పు కొలతలు కలిగి సుమారు 70 లక్షల వ్యయంతో శంఖు, చక్ర, నామాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఈవో రామచంద్రమోహన్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా రాత్రి 7 గంటలకు విద్యుత్ దీపాలతో వెలిగించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈ సూర్యనారాయణ, డీఈ రాంబాబు, ఏఈ చౌదరి, అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు. సముద్రతీరం నుంచి జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలలో, రైలులో ప్రయాణించే ప్రయాణికులకు సైతం ఈ శంఖు, చక్ర నామాల విద్యుత్ దీప అలంకరణలో కనపడతాయి.

ఐటీడీఏ స్పందనకు 53 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం, ఫిబ్రవరి 5: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో సుమారు 53 దరఖాస్తులు అందాయని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఆయన సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్‌తో కలిసి స్పందన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కానివాడ పంచాయతీ సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలని, పింఛన్లు మంజూరు చేయాలని, ఆకూరు పంచాయతీలో జాఫ్రా పంట రైతులకు టార్పాలిన్లు మంజూరు చేయాలని, మాడేరు వాగులో రైతులకు నీరు మళ్లించేందుకు చేసిన ఐ రన్ సెర్లకు చెల్లించాల్సిన సొమ్మును మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఎన్సీసీ డీఎస్ శాస్త్రి, డీడీ అబుసలాం, ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, పశుసంవర్థక డీడీ షరీఫ్, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీఈవో మల్లేశ్వరరావు, డీఎస్పీవో రాఘవన్, డీఎల్‌పీవో కె.కోటేశ్వరరావు, వైద్యాధికారిణి ఇందిరా పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజలు

నిడదవోలు, ఫిబ్రవరి 5: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మను సోమవారం పలువురు అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ ఆర్కియాలజీ మ్యూజియం కమిషనర్ జి.వాణీమోహన్ అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాస్, సమిశ్రగూడెం ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఎస్‌వీవీ రమేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరితో ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా ఈవో బళ్ల నీలకంఠం, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకట కృష్ణ అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

120 పట్టాలపై పాత తేదీతో సంతకాలా?

- బిక్కవోలులో బదిలీ అయిన తహశీల్దార్ నిర్వాకం ఇది..
- సెలవు రోజు వచ్చి సంతకాలు చేయడంపై అనుమానాలు
- ఇళ్ల పట్టాల పేరుతో దోపిడీ: నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఫిబ్రవరి 5: బదిలీ అయిన తహశీల్దార్ వచ్చి పాత తేదీతో 120 పట్టాలపై సంతకాలు పెట్టడం చర్చనీయాంశమైంది. బిక్కవోలులో జగనన్న ఇళ్ల పట్టాల పేరుతో భారీ దోపిడీ జరుగుతుందని, బదిలీ అయిన తహశీల్దార్ ఆదివారం వచ్చి 120 పట్టాలపై సంతకాలు పెట్టడమేమిటని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. టీడీపీ నేతలతో కలిసి సోమవారం బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయంలో అధికారులను కలిసి విలేకరులతో మాట్లాడారు. బదిలీ అయిన తహశీల్దార్ పోసిబాబు ఆదివారం వచ్చి 120 పట్టాలపై సంతకాలు చేశారని తెలిపారన్నారు. ఈ పట్టాలన్నీ గతంలో జగనన్న లేఅవుట్లలో దారికోసం వదిలిన భూములని తెలిపారు. ఈ పట్టా ఒక్కింటికీ రూ. 1.50 లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బిక్కవోలులో 940 పట్టాలు ఇచ్చారని దీంతో రూ.10 కోట్లు వరకూ చేతులు మారాయన్నారు. పార్టీలకతీతంగా ఇళ్లిస్తున్నామని చెప్పుకుంటున్న నేతలు అనర్హులు, డబ్బులు ఇచ్చిన వారికే పట్టాలు ఇస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం ఈ పట్టాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన తహశీల్దార్ వచ్చి పాత తేదీలతో ఎలా సంతకాలు పెట్టారన్న విషయాన్ని ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని రామకృష్ణారెడ్డి వివరించారు. గ్రామానికి చెందిన మాదిరెడ్డి శాంతికి మూడేళ్ల కిందట స్థలం కేటాయించామని పట్టా ఇచ్చి ఇప్పటివరకు స్థలం చూపించకుండా తిప్పుతున్నారన్నారు. ఆమె డబ్బు ఇవ్వకపోవడమే దానికి కారణమన్నారు. ఆయన వెంట దేశం నేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, ఇంటి స్థల బాధితురాలు మాదిరెడ్డి శాంతి ఉన్నారు.

సర్పంచుల అక్రమ అరెస్టు దారుణం

- చలో అసెంబ్లీకి వెళ్లకుండా సర్పంచ్‌ల హౌస్ అరెస్టులు
- మహిళా సర్పంచ్ ఇంటి వద్ద ఏఎస్ఐతో బందోబస్తు
- సర్పంచ్‌కు మద్దతు తెలిపిన టీడీపీ నాయకులు



మాచవరంలో సర్పంచ్ ఇంటి వద్ద టీడీపీ నేతల నిరసన

అంబాజీపేట, ఫిబ్రవరి 5: సర్పంచ్‌ల 16 డిమాండ్లు నెరవేర్చాలని మంగళవారం చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు ఒక రోజు ముందుగానే సర్పంచ్‌లను హౌస్ అరెస్టు చేశారు. వైసీపీ ప్రభుత్వం కాజేసిన ఆర్థిక సంఘం నిధులను తక్షణం సర్పంచ్ ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టే నిరసనను ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి విజయవాడకు వెళ్తున్న సమయంలో అంబాజీపేట పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. సర్పంచ్‌తో పాటు ఆమె భర్త నాగాబత్తుల వెంకటసుబ్బారావును అడ్డుకునేందుకు ప్రయత్నించారు. మహిళా సర్పంచ్ ఇంటి వద్ద మహిళా పోలీసులను కాపాలా ఉంచాల్సి ఉండగా పోలీసులు సాధారణ దుస్తులతో ఓ ఏఎస్ఐను బందోబస్తుగా ఉంచారు. దీనిపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. చలో అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడంతో సర్పంచ్ శాంతకుమారి ఇంటి వద్ద దీక్ష చేపట్టింది. టీడీపీ నాయకులు సర్పంచ్ ఇంటి వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు. ప్రభుత్వం నిరుంకుశ వైఖరి నశించాలని నినాదాలు చేశారు. సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం వెళ్తుంటే పోలీసులు గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. తక్షణం ప్రభుత్వం కాజేసిన ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్ ఖాతాలకు జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గణపతి వీరరాఘవులు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, ఆరిగెల బలరామమూర్తి, బొంతు పెదబాబు, చిన్నం బాలవిజయరావు, రవణం రాము, గుడాల ఫణి, పబ్బినీడి రాంబాబు, కొప్పినీడి ఈశ్వరరావు, వార్డు సభ్యులు మద్దతు తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తం నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 5: సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో మార్చి 6 నుంచి 11 వరకూ జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయ ఆవరణలో ఉత్సవ ఏర్పాట్లు ప్రారంభంలో భాగంగా సోమవారం పందిరి రాట ముహూర్త పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలలో పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఉత్సవాలు

భక్తులు, అధికారులు అందరి సహకారంతో మార్చి 6 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించాలని సామర్లకోట భీమేశ్వరాలయ ఆలయ ఈవో డి. నాగ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆలయ ఆవరణలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై వివిధ వర్గాలు, భక్త కమిటీ తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి మహా శివరాత్రి ఉత్సవాలకు భక్తులు విచ్చేయనున్నందున వారికి ఏ అసౌకర్యం లేకుండా పటిష్టమైన ఏర్పాట్లను చేయాలని పలువురు సూచించారు. ఆలయ కోనేరు పుష్కరిణిలో పాతనీటిని పూర్తిగా పంపింగ్ చేసి చెరువు అంతటా ఇసుక వేసిన అనంతరం నీటిని నిల్వ చేయాలని పలువురు భక్తులు సూచించారు. వీఐపీ దర్శనాలతో సాధారణ క్యూలైన్లలో దర్శనాలకు వెళ్లే భక్తులకు ఏ అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సూచించారు. సమావేశంలో బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాఖలో ప్రమాదం

సీపీ రెడ్డి హీరో మోటార్స్ షోరూం అధినేత కుమారుడు దుర్మరణం



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజమహేంద్రవరానికి చెందిన సీపీ రెడ్డి హీరో మోటార్స్ షోరూం అధినేత చింతా ప్రసాద్ రెడ్డి తనయుడు చింతా నాగ ప్రణవ్ రెడ్డి (24) మృతిచెందారు. రాజమహేంద్రవరానికి చెందిన సీపీ రెడ్డికి కుమారుడు నాగప్రణవ్‌రెడ్డి, కుమార్తె ఉన్నారు. విశాఖపట్నం గీతమ్స్ కళాశాలలో ప్రణవ్ రెడ్డి ఎంబీఏ చదువుతున్నాడు. కొద్ది రోజుల కిందట సెలవులకు రాజమహేంద్రవరం వచ్చిన ప్రణవ్ ఇటీవల తిరిగి విశాఖ వెళ్లాడు. ఆదివారం రాత్రి రుషికొండ నుంచి తన మోటర్ బైక్‌పై వెళుతుండగా ఎదురుగా బుల్లెట్‌పై అతివేగంగా ఇద్దరు యువకులు వచ్చి ఢీకొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రణవ్ రెడ్డిని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. నాగప్రవణ్‌రెడ్డి మృతదేహాన్ని సోమవారం రాజమహేంద్రవరంలోని దానవాయిపేట ఇంటికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. జక్కంపూడి విజయలక్ష్మి, టీకే విశ్వేశ్వర రెడ్డి, స్వర్ణాంధ్ర నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, గంటా సునీల్, వ్యాపారవేత్తలు, ప్రముఖులు ప్రణవ్ నివాళులర్పించారు. సీపీ రెడ్డిని కుటుంబీకులు ఓదార్చారు.

జనసేన నేతపై కత్తులతో దాడికి ప్రయత్నం

పోలీసులకు ఫిర్యాదు



వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాసరావు

పిఠాపురం, ఫిబ్రవరి 5: కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల జనసేన పార్టీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం నలుగురు వ్యక్తులు హల్‌చల్ చేశారు. వారు తనపై కత్తులతో దాడికి ప్రయత్నించారని జనసేన నాయకుడు మాదేపల్లి శ్రీనివాసరావు రాత్రి పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ కార్యాలయం వద్ద రోడ్డు మీద నిలుచుని ఫోన్ మాట్లాడుతుండగా, నలుగురు వ్యక్తులు తన వద్దకు వచ్చి వారు తెచ్చుకున్న కత్తులతో దాడికి ప్రయత్నించారని ఫిర్యాదులో తెలిపారు. తాను గట్టిగా కేకలు వేయడంతో టూ వీలర్ మీద పరారయ్యారని పేర్కొన్నారు. రాజకీయంగా జనసేన పార్టీలో చురుకుగా పనిచేయడం చూసి ఓర్వలేక ఈ దాడి చేయించడానికి ప్రయత్నించినట్లు తనకు అనుమానం ఉందని ఫిర్యాదులో తెలిపారు. పిఠాపురం పట్టణ ఎస్ఐ మురళీమోహన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో మాదేపల్లి శ్రీనివాసరావు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి కిరణ్ తదితర నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన బలోపేతం అవ్వడం చూసి ఓర్వలేకే కత్తులతో దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. ఇటువంటి వాటికి జనసైనికులు, నాయకులు బెదిరే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. జనసేన పటిష్టత కోసం మరింత కష్టించి పనిచేస్తామని తెలిపారు. కాగా ఈ సంఘటనపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆరా తీశారు.

పి.గన్నవరం జనసేన ఇన్‌చార్జిగా గిడ్డి సత్యనారాయణ



పి.గన్నవరం, ఫిబ్రవరి 5: పి.గన్నవరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిగా గిడ్డి సత్యనారాయణను నియమిస్తూ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం రాత్రి నియామక ఉత్తర్వులు అందించినట్లు ఉమ్మడి జిల్లాల జనసేన ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు తెలిపారు. పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామానికి చెందిన సత్యనారాయణ తెలంగాణ రాష్ట్రం పోలీస్‌శాఖలో ఏవోగా పనిచేశారు. ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామ చేసి సోమవారం మంగళగిరి పార్టీ ప్రధాన కార్యాలయంలో అధినేత సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. పార్టీకోసం కష్టపడి పనిచేసి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని అధినేత పవన్‌కల్యాణ్ సూచించినట్లు గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లాల పార్టీ కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, దొమ్మేటి సాయికృష్ణ, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, నాయకులు యల్లమిల్లి చిట్టిబాబు, అడబాల తాతకాపు, సలాది బుచ్చిరాజు, తాటికాయల శ్రీనివాస్ ఉన్నారు.

దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ పూజలు



ఆలయంలో దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్



బంగారు తిరునామం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ కేవీఎల్ హరినాథ్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అయనకు వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఈవో ముదునూరి సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. వేంకటేశ్వరస్వామికి లొల్ల గ్రామానికి చెందిన ముక్కవిల్లి శ్రీరామచంద్రమూర్తి-లక్ష్మీనరసమాంబ దంపతులు 9.6 గ్రాములతో చేయించిన బంగారు తిరునామాన్ని సమర్పించారు. సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,90,954 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

తొండంగి, ఫిబ్రవరి 5: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు అన్నవరం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. సోమవారం సాయంత్రం అన్నవరం గ్రామానికి చెందిన లింగంపల్లి శ్రీను(58) అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా బెండపూడి వైపు వెళ్తున్న ప్రైవేటు స్కూల్ బస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు యువతి

క్షేమంగా అప్పగించిన తుని రైల్వే పోలీసులు

తుని రూరల్, ఫిబ్రవరి 5: తల్లిదండ్రులపై అలిగి ఇంటి నుంచి పారిపోయిన యువతిని తుని రైల్వే పోలీసులు గుర్తించారు. అన్నవరం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రైల్వే పోలీసు సూర్యప్రకాష్ ఆమెను గమనించి ఆరా తీశారు. అత్తిలి పట్నానికి చెందిన వాకభట్ల నాగ సాయి దేవికగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి బాలికతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలికను అప్పగించారు.

కొండరెడ్ల గ్రామాలకు విద్యుత్

- రూ.14.96 కోట్ల అంచనా
- రంప ఐటీడీఏ పీవో సూరజ్



విద్యుత్ పనులు చేస్తున్న కార్మికులు

రంపచోడవరం, ఫిబ్రవరి 5: ఏజెన్సీలో రూ.14.96 కోట్ల అంచనా వ్యయంతో కొండరెడ్ల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్మన్ పథకం ద్వారా పీవీటీజీలు నివసిస్తున్న 314 గ్రామాలకు విద్యుత్ సౌకర్యంతో పాటు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 930 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని, ఈ నెల చివరి నాటికి పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

అమలాపురం-చల్లపల్లి పంటకాల్వలో మళ్లీ మొసలి కలకలం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 5: అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంటకాల్వలో మళ్లీ మొసలి కలకలం రేగింది. గోపవరం పంచాయతీ జయపురం వద్ద పంటకాల్వలో సోమవారం ఉదయం తమకు మొసలి కనిపించిందంటూ పలువురు మహిళలు, వృద్ధులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము మొసలిని చూశామంటూ సర్పంచ్ కుంచే బుల్లియ్యకు గ్రామస్తులు వివరించారు. కాల్వ పక్కనే నివాసముంటున్న తమ కుటుంబాలకు మొసలి వల్ల ఎటువంటి ప్రమాదం సంభవించకుండా చూడాలని మొరపెట్టుకున్నారు. అధికారులతో మాట్లాడి అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటానని సర్పంచ్ హామీ ఇచ్చారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

ఏజెన్సీ సమాచారం

రాజవొమ్మంగి తహశీల్దార్‌గా సత్యనారాయణ



రాజవొమ్మంగి ఫిబ్రవరి 5: రాజవొమ్మంగి మండల తహశీల్దార్‌గా డి.వి.సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన వై.వి.సుబ్రహ్మణ్యాచార్యులు తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి బదిలీ కాగా, ఏలూరు జిల్లా కామవరపుకోట తహశీల్దార్‌గా పనిచేసిన సత్యనారాయణ బదిలీపై రాజవొమ్మంగి వచ్చారు.

రాజవొమ్మంగి ఎంపీడీవోగా యాదగిరేశ్వరరావు



రాజవొమ్మంగి ఫిబ్రవరి 5: రాజవొమ్మంగి ఎంపీడీవోగా ఎల్.యాదగిరేశ్వరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆయన డిప్యూటేషన్‌పై వై.రామవరం ఎంపీడీవోగా వెళ్లారు, ఎన్నికల నియమావళి ప్రకారం డిప్యూటేషన్లు రద్దు చేయడంతో తిరిగి రాజవొమ్మంగి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు రాజవొమ్మంగి ఎంపీడీవోగా ఉన్న ఎంవీ రంగారావు అడ్డతీగల ఎంపీడీవోగా వెళ్లారు.

మారేడుమిల్లి తహశీల్దారుగా రమణారావు



మారేడుమిల్లి, ఫిబ్రవరి 5: మారేడుమిల్లి నూతన తహశీల్దారుగా అల్లాది వెంకట రమణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు తహసీల్దారుగా ఆయన ఇప్పటివరకు పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా చెప్పారు.

రంపచోడవరం తహశీల్దారుగా కృష్ణజ్యోతి



రంపచోడవరం, ఫిబ్రవరి 5: రంపచోడవరం తహశీల్దారుగా ఎ.కృష్ణ జ్యోతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరు జిల్లా చింతలపూడిలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అలాగే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. డీటీటీ రాజు, రెవెన్యూ ఎం.విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు ఎస్.చెల్లాయమ్మ, డి.ఇందిరాబాయ్, సాయి, వీఆర్వోలు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించారు.

వై.రామవరం తహశీల్దార్‌గా నాగరాజు



శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

వై.రామవరం, ఫిబ్రవరి 5: విధులలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించిన సహించేది లేదని వై.రామవరం నూతన తహశీల్దార్ ఎస్.నాగరాజు కార్యాలయ సిబ్బందికి స్పష్టం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం నుంచి ఎన్నికల బదిలీలలో భాగంగా నియామకమైన ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై ఎన్నికలు వస్తున్న తరుణంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అనంతరం సిబ్బంది తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

దేవీపట్నం తహశీల్దార్‌గా చలపతిరావు



అభినందనలు చెబుతున్న సిబ్బంది

దేవీపట్నం,ఫిబ్రవరి 5: దేవీపట్నం నూతన తహశీల్దార్‌గా చలపతిరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన ఏలూరు కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా దేవీపట్నం తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చలపతిరావుకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

టీడీపీ నాయకులకు పోలీసుల నోటీసులు

దేవీపట్నం, ఫిబ్రవరి 5: మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు దేవీపట్నం పోలీసులు నోటీసులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పిలుపుమేరకు మంగళవారం చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లొద్దంటూ పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, పలువురు టీడీపీ నాయకులు నోటీసులు అందుకున్నారు.

ఎస్‌బీఐ స్కీములపై కళాజాత

కూనవరం,ఫిబ్రవరి5: కళాజాత ద్వారా ఎస్‌బీఐ స్కీములను ప్రజలకు వివరించారు. కూనవరం ఎస్‌బీఐ మేనేజర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, ముద్రలోన్, కేసీసీ రుణాలు స్వయం సిద్ధ పథకం రుణాలు, రైతులకు సంబంధించి ట్రాక్టర్లు కొనేందుకు రుణాలతో పాటు ఇతర రుణాల గురించి తెలియజేశారు. అంతేకాకుండా సీఎం విశ్వకర్మలోన్, యోనో యాప్ వినియోగం, నగదు రహిత లావాదేవీలు, బంగారంపై రుణాలపై వివరించారు. సైబర్ నేరగాళ్ల మోసం గురించి ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కనకారావు, సంతోష్, యు.రమేష్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు కుట్టుమిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఫిబ్రవరి 5: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో సీఆర్పీఎఫ్ క్యాంప్ ఆఫీస్‌లో డిప్యూటీ కమాండెంట్ బి.రత్నమ్మ, సర్పంచ్ సంధ్యారాణి ఆధ్వర్యంలో సివిక్స్ యాక్షన్ ప్రోగ్రాం ప్రారంభించారు. 15 మంది నిరుపేదలకు, గిరిజన మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. డిప్యూటీ కమాండర్ రత్నమ్మ మాట్లాడుతూ డొంకరాయి సీఆర్పీఎఫ్ క్యాంప్ ఆఫీసులో టైలరింగ్ శిక్షణ అందించామన్నారు. సోమవారం 5 గ్రామాలకు చెందిన వారికి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. సీఆర్పీఎఫ్ క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, బెటాలియన్ జవాన్లు దేశభక్తి పాటలు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో అలరించారు. వారికి కమాండెంట్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ జె.నితిన్, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సీవీ గౌడ, డొంకరాయి ఎస్ఐ శివకుమార్, ఉపసర్పంచ్ కూన, సీఆర్పీఎఫ్ ఎఫ్/42 బెటాలియన్, డొంకరాయి గ్రామస్తులు పాల్గొన్నారు.

గోతులను పూడ్చిన అధికారి

మోతుగూడెం, ఫిబ్రవరి5: చింతూరు మండలం మోతుగూడెం సుకుమామిడి నుంచి చింతూరు వెళ్లే రహదారిలో ఎక్కడికక్కడ గుంతలు పడటంతో అది గమనించిన ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు తన సిబ్బందితో సోమవారం ఆ గోతుల్లో మట్టి వేసి పూడ్చారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకుని రహదారులను బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇద్దరికి తెలుగు భాష సేవారత్న పురస్కారాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: జిల్లాకు చెందిన ఇరువురికి తెలుగు బాషా సేవారత్న పురస్కారాలు లభించాయి. గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అందజేశారు. అధికార బాషా సంఘం, నాగార్జున విశ్వవిద్యాలయం ,ప్రవాసాంధ్ర తెలుగు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పత్రికా రంగంలో, తెలుగు బాషా సాహిత్యానికి విశేష సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ వీఎస్ఎస్ కృషకుమార్, రచయత చిలుకూరి శ్రీనివాసరావులకు అవార్డులను ప్రకటించారు.

ప్రతి ఓటుపైనా అవగాహన ఉండాలి

» టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

» క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులకు సమగ్ర శిక్షణ తరగతులు

అనపర్తి, ఫిబ్రవరి 5: నియోజకవర్గంలోని ప్రతి ఓటుపైనా టీడీపీ బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటరు సవరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగక పోవడంతో ఓటరు జాబితా అస్తవ్యస్తంగా మారిందని, ఓటరు జాబితాపై నాయకులు దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించి ఇంటిగ్రేటెడ్ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇప్పటికే ఎన్నికలు సమీపించాయని, ప్రతిఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే ఎన్నికల సమయానికి పని ఒత్తిడి తగ్గుతుందన్నారు. అలాగే గ్రామాల్లో నాయకులు ప్రతి ఓటరును కలిసి వైసీపీ అవినీతి పాలనను వివరిస్తూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువచేసి ఓటు అడగాలన్నారు. వచ్చే 60 రోజులు ఎంతో కీలకమని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులుతో బాటు ఆళ్ల గోవిందు, జుత్తుగ కృష్ణ, వెలుగుబంటి సత్తిబాబు, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, మామిడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న రామకృష్ణారెడ్డి



గోకవరం: తంటికొండలో టీడీపీలో చేరిన వారితో జ్యోతుల నవీన్

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : జ్యోతుల నవీన్

గోకవరం, ఫిబ్రవరి 5: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన సుమారు 50 మంది వైసీపీ కార్యకర్తలు సోమవారం టీడీపీలో చేరారు. వారికి నవీన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో నవీన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమర్థుడైన నాయకుడని, ఆయనను ఎమ్మెల్యేను చేయాలనే ఉద్దేశంతోనే గోకవరం మండలం నుంచి టీడీపీలోకి చేరికలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పార్టీలోకి ఎంతమంది వచ్చినా వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బదిరెడ్డి అచ్చన్నదొర, పూలపల్లి కృష్ణ, డీవీవీ సీతారాం, గాజింగం సత్తిబాబు, బదిరెడ్డి రవి, పెద్దాడ వెంకన్నదొర పాల్గొన్నారు.

అభివృద్ధి ముసుగులో ఎంపీ తెలివైన వ్యాపారం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: అభివృద్ధి ముసుగులో ఎంపీ భరత్ రామ్ తెలివైన వ్యాపారం చేశాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. రాజమండ్రి జేఎన్ రోడ్డులోని వెంకటేశ్వరా నగర్ వాకర్స్ పార్కు వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాసులకు కక్కుర్తిపడి, కమిషన్లకు అలవాటపడిన ఎంపీ భరత్ నగర ప్రతిష్ఠను మంటగలిపాడని మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన సుబ్రహ్మణ్యమైదానంలో బ్లేడుబ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లు ,అల్లరి చిల్లరగా తిరిగేవాళ్ళు ఉన్నారని భరత్ రామ్ అని దానిని అందుకోసమే ఓపెన్ ఆడిటోరియం స్క్రీన్ ఏర్పాటు చేశామనడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. తన వ్యాపారాన్ని పెంచుకునేందుకు ప్రతి సమావేశం సభ తన మార్గాని ఎస్టేట్‌లోనే పెట్టుకునే విధంగా భవిష్యత్ వ్యాపారం కోసం నగరంలో ఉన్న ఖాళీ స్థలాల్లో అభివృద్ధి పేరుతో ఎంపీ భరత్ రామ్ నిర్మాణాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. నగరంలో చేపడుతున్న పనులన్నీ నాణ్యత లోపంతో జరిగాయన్నారు.

ఎంపీ సిఫార్సుతో ఏపీపీ నియామకం సరికాదు

టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: న్యాయవ్యవస్థ ప్రతిష్ట కు భంగం కలిగేలా వివాదాల్లోను, పోలీసు కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తులకు కోర్టులో నియామకానికి ఎంపీ భరత్ రామ్ సిఫార్సు చేయడం సరైన విధానం కాదని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో మూడు కేసుల్లో ఉన్న కోడి సతీష్ నాయుడుని ఎంపీ భరత్ రామ్ సిఫార్సుతో ప్రిన్సిపల్ అసిస్టెంట్స్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారని ఇప్పుడు ప్రభుత్వమే ఆయన ప్రవర్తనతో పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. టీడీపీ లీగల్ సెల్ నగర అధ్యక్షుడు నామా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొమ్మర్తి బాబ్జి మాట్లాడుతూ ఎంపీ భరత్ కార్పొరేటర్‌కు ఎక్కువ ఎమ్మెల్యేకు తక్కువ అని మండిపడ్డారు.

అనపర్తి తహశీల్దార్‌గా నాగరాజునాయక్

అనపర్తి, ఫిబ్రవరి 5: అనపర్తి తహశీల్దార్‌గా బి.నాగరాజు నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆయన కొవ్వూరు నుంచి బదిలీపై అనపర్తి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన వై.సరస్వతి ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నాయక్‌కు డీటీ శశిధర్, ఎన్నికల డీటీ మహాలక్ష్మి తదితర సిబ్బంది స్వాగతం పలికారు.

రాజానగరం తహశీల్దార్‌గా కనకరాజు

రాజానగరం, ఫిబ్రవరి5: రాజానగరం తహశీల్దార్‌గా జి.కనకరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన రానున్న ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన పవన్‌కుమార్ కృష్ణా జిల్లా గన్నవరంకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కనకరాజుకు కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కడియం తహశీల్దార్‌గా రమాదేవి



కడియం, ఫిబ్రవరి 5: కడియం తహశీల్దార్‌గా బి.రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఏలూరు కలెక్టరేట్‌గా ఏవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రూరల్ తహశీల్దారుగా అప్పారావు



రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 5: రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దారుగా అప్పారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కాగా ఈవోపీఆర్‌డీగా బదిలీపై నియమితులైన డి.బాబూరావు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు.

రంగంపేట తహశీల్దార్‌గా లతీఫ్‌పాషా



రంగంపేట, ఫిబ్రవరి 5: రంగంపేట తహశీల్దార్‌గా లతీఫ్‌పాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణా జిల్లా కోడూరులో నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన దొరకయ్య తిరిగి డిప్యూటీ తహశీల్దార్‌గా కొనసాగుతారు. ఈ సందర్భంగా లతీఫ్‌పాషాకు డీటీ ఎస్.దొరకయ్య, ఆర్ఐ విశ్వతేజ, సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.

నాగ నరసింహారావు సంతాప సభ

కోరుకొండ, ఫిబ్రవరి 5: మండలంలోని జంబుపట్నంలో టీడీపీ సీనియర్ నాయకుడు బలరామయ్యచెరువు సాగునీటి సంఘ అధ్యక్షుడు నాగ నరసింహారావు సంతాప సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొని కుటుంబ సభ్యులు నాగ రమేష్, నాగ వీరబాబులతో కలిసి సంతాపం ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, జనసేన ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ, పెందుర్తి అభిరాం, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్, కాంగ్రెస్ నాయకులు కురుమెళ్ళ గంగరాజు, కర్రి వీరగణేష్, సర్పంచ్‌లు వుల్లి అప్పన్నదొర, నాగ సత్యనారాయణ, ఎంపీపీ వుల్లి సూర్యకుమారి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం

కడియం, ఫిబ్రవరి 5: యోగి వేమన జయంతి సందర్భంగా త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలపై వీరవరంలో ప్రచారం నిర్వహించారు. ఆధ్యాత్మికత గురించి అవగాహన కల్పిస్తూ హిందుత్వంలోని సాంప్రదాయాలను వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, లక్ష్మీనారాయణ, పీఎస్ఎన్ మూర్తి, విజయ్, జయరామ్, భరత్, రాణి, సూర్యకుమారి, వేణుమాదురి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకళాకారుడు గరికపాటి



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 5 : ప్రజాకళాకారుడు, పేదల మనిషి గరికపాటి రాజారావు అని రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గరికపాటి జయంతి సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యమైదానంలోని గరికపాటి విగ్రహానికి కమిటీ సభ్యులు టీకే విశ్వేశ్వరరెడ్డి, కేకే సంజీవరావు, ఎల్‌వీ ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 5: ప్రపంచ కేన్సర్ నివారణ దినం సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు జీఎస్ఎల్ మెడికల్ కళాశాలకు చెందిన వైద్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల కేన్సర్‌లు, వాటి లక్షణాలు, చికిత్సా విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, వైద్యులు ఎన్ రవిశంకర్, సమీజ, సుహాస్, హిమశంకర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి రూ. 8.40 లక్షల ఆదాయం

బిక్కవోలు, ఫిబ్రవరి 5: బిక్కవోలు గ్రామంలో వున్న శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలంలో స్వామి వారికి రూ. 8.40 లక్షలు ఆదాయం వచ్చిందని ఈఓ ఎం. రాంబాబురెడ్డి తెలిపారు. కొబ్బరి చెక్కల లైసెన్స్ హక్కుకు రూ. 3.99 లక్షలు, పటికబెల్లకు రూ. 3.33 లక్షలు, వస్త్రాలకు రూ. 1.08 లక్షలు వచ్చిందన్నారు. ఈనెల 8 నుంచి వచ్చే యేడాది ఫిబ్రవరి 7 వరకూ ఈలైసెన్సులు చెల్లుతాయన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు తాటాకిళ్లు దగ్ధం

సీతానగరం, ఫిబ్రవరి 5: మండలంలోని నల్గొండలో సోమవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో బందిలి చిట్టియ్య, బందిలి అప్పన్నలకు చెందిన ఇళ్లు కాలిపోయాయి. ఇంట్లోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం మంటలను అదుపు చేసింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వీఆర్వో వెంకట్రావు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వైసీపీ నాయకుడిపై ఎంపీడీవోకు ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న రామచంద్రపురం గ్రామ దళితులు

సీతానగరం, ఫిబ్రవరి 5: మండలంలోని పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురానికి చెందిన దళితులు వైసీపీ నాయకుడిపై సోమవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఓ వీధిలో డ్రైనేజీ మంజూరు కాగా ఇంజనీర్‌ను తీసుకువచ్చి పరిశీలించి కొలతలు వేయించి, తరువాత ఇక్కడ రోడ్డు సన్నగా ఉంది డ్రైనేజీ రాదు, తూరలు ఏర్పాటు చేసుకోమని చెప్పారన్నారు. అయితే తమకు డ్రైనేజీ కావాలని, అందుకోసం తమ స్థలంలో అవసరమైన మేరకు తవ్వుకోమని, డ్రైనేజీ ఏర్పాటు చేయమని వైసీపీ నాయకుని ఇంటికి వెళితే ఆయన అగౌరవంగా మాట్లాడడమే కాకుండా మీరు టీడీపీ మనుషులు బయటకు పొండి డ్రైనేజీ లేదు, ఏమీ లేదంటూ అవమానించారని కొండేపూడి ధనలక్ష్మి, పల్లి శశికళ, ఉర్ల రమణ, ఉర్ల శ్యామల, బ్రహ్మాజీ తదితరులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం రద్దు

రంగంపేట, ఫిబ్రవరి 5: రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు జరగవలసిన సర్వసభ్య సమావేశం రద్దు చేసినట్టు ఎంపీడీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంపీడీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల పని కేటాయించినందున సమావేశం రద్దు చేశామని, నిర్వహణ తేదీని తదుపరి తెలియజేస్తామని చెప్పారు.

కోరుకొండలో జనసేన మహాపాదయాత్ర

కోరుకొండ, ఫిబ్రవరి 5: కోరుకొండలో సోమవారం జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కో ఆర్డినేటర్‌బత్తుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మహాపాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలతో ముద్రించిన కరపత్రాలు అందజేశారు. ఒక్కసారి జనసేనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో అడపా శ్రీనివాస్, బదిరెడ్డి దొర, తాటికొండ శ్రీను, తాటికొండ రామచంద్రరావు, చదువు ముక్తేశ్వరరావు, యర్రంశెట్టి పోలారావు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు.. మండలం కోటి, గాడాల గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరారు. వీరందరికీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రఘు కుంచే తండ్రి ప్రథమ వర్ధంతి



కోరుకొండ, ఫిబ్రవరి 5: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు, నిర్మాత రఘు కుంచేను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ గాదరాడ రఘు స్వగృహంలో పరామర్శించారు. సోమవారం రఘు తండ్రి లక్ష్మీనారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను కలిసి పలకరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అడపా శ్రీనివాస్, మేడిశెట్టి శివరాం, దేవన దుర్గాప్రసాద్, యర్రంశెట్టి పోలారావు, వీఆర్వోల సంఘం నాయకుడు కుంచే శ్రీనివాస్ పాల్గొన్నారు.

కణుపూరులో ఇళ్ల పట్టాలు పంపిణీ

కోరుకొండ, ఫిబ్రవరి 5: మండలంలోని కణుపూరు గ్రామంలో 95 మంది లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న వారు గ్రామ సచివాలయంలో నమోదు చేసుకున్న 90 రోజుల్లో విచారణ జరిపి ఇళ్ల స్థలాల పట్టాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం రమణ, కల్యాణం చిట్టిబాబు, కల్యాణం రాంబాబు, కొరుకొండ వెంకటలక్ష్మి, కటకం బాబ్జి, దొరబాబు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ మ్యాట్ అందజేత

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: యువత క్రీడల్లో రాణించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 49వ డివిజన్‌కు చెందిన క్రీడాకారులకు క్రికెట్ మ్యాట్‌ను తిలక్‌రోడ్డు టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం అందజేశారు. క్రీడల్లో రాణించిన యువతకు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో బుడ్డిగ రాధా, నక్కా దేవి వరప్రసాద్, ఉర్లంకల లోకేష్ పాల్గొన్నారు.

'ప్రత్యేక హోదా తెచ్చేది కాంగ్రెస్ పార్టీయే'

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేది ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ రాజమహేంద్రవరం అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. రాజమహేంద్రవరం నగర కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాంతీయ పార్టీలతో రాష్ట్రానికి ప్రత్యేకహోదా రాదన్నారు. సమావేశంలో ముళ్ళ మాధవ్, భాగ్యసూర్యలక్ష్మి, చింతాడ వెంకటేశ్వరరావు, చామర్తి లీలావతి, బత్తిన చంద్రరావు, యిజ్జరోతు విజయలక్ష్మి, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

13 వరకూ లెప్రసీ అవగాహన కార్యక్రమాలు

జిల్లా లెప్రసీ నివారణాధికారిణి డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం అర్బన్/కడియం, ఫిబ్రవరి 5: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30వ తేదీ నుంచి ప్రారంభమైన స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమం ఈ నెల 13వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు జిల్లా లెప్రసీ నివారణాధికారిణి డాక్టర్ ఎన్.వసుందర అన్నారు. రాజమహేంద్రవరం ఇమ్మానుయేల్ లెప్రసీ కాలనీ, కడియం మండలం చైతన్యనగర్‌లో సోమవారం యాంటీ లెప్రసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం లెప్రసీ బాధితులకు దుప్పట్లు, టవళ్లు, మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం అందించారు. కార్యక్రమాల్లో పీహెచ్‌సీ డాక్టర్ మౌర్య, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ టీమ్ డీపీఎంవో జోగేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారులు ఎంబీవీ రామకృష్ణ, ఎండీ ఆలీబేగ్, నర్సింగ్‌స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ గోడపత్రిక ఆవిష్కరణ



కడియం, ఫిబ్రవరి 5: ఏ రాజకీయ పార్టీ అయితే ఓపీఎస్‌కు మద్దతు ఇస్తుందో వచ్చే ఎన్నికల్లో ఉద్యోగుల దానికే ఓటేస్తారని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఈవీవీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఓట్ ఫర్ ఓపీఎస్ గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రాలు ఓపీఎస్ వైపు మల్లుతున్నాయన్నారు. ఓపీఎస్ నినాదం వచ్చే ఎన్నికల్లో జాతీయ స్థాయి నినాదం కాబోతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్బాయి, వేదుల శాస్త్రి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.అనిత, లక్ష్మణకుమార్, వనజ, భద్రరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

పీఆర్ ఎస్ఈగా మహ్మద్ ఆలీముల్లా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ జిల్లా అధికారి(ఎస్ఈ)గా మహ్మద్ ఆలీముల్లా నియమితులయ్యారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఎస్ఈగా పనిచేసిన ఏబీవీ ప్రసాద్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో కృష్ణా జిల్లా నుంచి బదిలీపై ఆలీముల్లా వచ్చారు. ఈ మేరకు సిబ్బంది అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మిడ్ డే మీల్స్ కార్మికుల ధర్నా



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సందర్భంగా జగన్ ఇచ్చిన రూ.10వేల వేతన హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాల యం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసనకు దిగారు. ఎన్ని సార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.ఎండీఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిట్టా బేబీ, ఎల్లారీశ్వరి మాట్లాడు తూ ఎండీఎం కార్మికులకు ఉద్యోగ భద్రత కూడా లేదన్నారు. నిత్యావసర ధరలు విప రీతంగా పెరి గినా గౌరవ భృతి రూ.3వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. విద్యార్థికి రూ.20చొప్పున మెనూ చార్జీలు ఇస్తేగానీ వండి పెట్టడం సాధ్యం కాదన్నారు.సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందర బాబు, బి.రాజులోవ మాట్లాడుతూ తనిఖీలకు వస్తున్న వాళ్లు కూరగాయల ధరలు, నిత్యావసరాల రేట్లు, మెనూ చార్జీలు తక్కువగా ఉండడం, బిల్లుల ఆలస్యం వంటి విషయాలు పక్కనపెట్టి వంటకు వంకలు పెట్టే పనిలో ఉంటున్నారన్నాని విమర్శించారు.కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.అన్నామణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రాజా మద్దతు పలికారు.

ఇన్‌చార్జి డీపీవోగా రాంబాబు బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లు దాటి సొంత జిల్లాలో పనిచేస్తున్న, జిల్లా, మండల స్థాయి అధికారులను ఎన్నికల నిర్వహణలో భాగంగా సీఈవో ఆదేశాల మేరకు బదిలీ చేశారు. జిల్లా ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న జానా సత్యనారాయణను బాపట్లకు బదిలీ చేశారు. కర్లపాలెం ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న దాసరి రాంబాబును తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి డీపీవోగా నియమించారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రిజిస్ట్రేషన్లకు సర్వర్ కష్టాలు

నిడదవోలు, ఫిబ్రవరి 5 : జిల్లావ్యాప్తంగా సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో సాంకేతిక సమస్యలతో సర్వర్ పనిచేయకపోవడంతో తరచుగా రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా పాలకులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేకపోతున్నారు. నిడదవోలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో సోమవారం సర్వర్ సాంకేతిక సమస్య కారణంగా రిజిస్ట్రేష న్లు నిలిచిపోయాయి. ఈ నెలలో ఫిబ్రవరి 2వ తేది జిల్లా వ్యాప్తంగా సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోగా తిరిగి సోమవారం 5వ తేది మళ్లీ సర్వర్ సమస్యలు ఉత్పన్నమై రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సర్వర్ సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో సబ్ రిజిస్ట్రారు కార్యాలయ అధికారి వి.వెంకటేశ్వర్లు, సిబ్బంది, కక్షిదారులు సాయంత్రం వరకు ఎదురుచూశారు. అయినా లాభం లేకపోయింది.



నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారులు



ఏపీ ఎన్‌జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత

ఉద్యోగులకు ఎన్నికల విధులు

- నేటి నుంచి పీపీఎంఎస్ పోర్టల్‌లో డేటా ఎంట్రీ
- ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు లేదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమగ్ర డేటాను ప్రభుత్వ పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(పీపీఎంఎస్)లో తప్పని సరిగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని అన్ని శాఖల డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ (డీడీవో) అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌తో కలిసి ఆమె సమీక్షించారు. కొత్త జిల్లా పరిధిలో త్వరలో నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియను సజావుగా సాగించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల విధి నిర్వహణ విషయంలో ఎటువంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ కోసం ప్రిసైడింగ్,పోలింగ్ అధికారులను నియమిస్తామన్నారు. ప్రతి డీడీవో వారి పరిధిలోని ఆయా క్యాడర్‌లో పనిచేసే ఉద్యోగుల వివరాలు పీపీఎంస్ సాఫ్ట్‌వేర్‌లో క్రోడీకరించి ధ్రువీకరించాలన్నారు. ప్రతి అధికారి అందించిన సమాచారాన్ని ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు పీపీఎంఎస్‌లో అప్‌డేట్ చేసిన తర్వాత ర్యాండమైజేషన్ పద్ధతిలో ఎన్నికల విధుల కేటాయింపు ఉంటుందన్నారు.మహిళా ఉద్యో గులకు వారు పని చేసే ప్రాంతానికి అనుగుణంగా కేటాయింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.జిల్లాలో సుమారు 10 వేల మంది డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు.ఓటరు గుర్తింపు కార్డు వివరాలు నమోదు చేయాలని చెప్పారు.కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి 15 మంది టేడా ఎంటీ ఆపరేటర్లతో ఈ ప్రక్రియ చేపట్టినట్టు తెలిపారు. ట్రెజరీ శాఖ సీఎఫ్‌ఎంఎస్ డేటాకి అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వర్తిం చేవారిని గుర్తిస్తామని తెలిపారు. అధికారులకు రోజువారి డేటా ఎంట్రీ కోసం ఏ స్లాట్ ఇచ్చామో తెలియజేస్తామన్నారు.కలెక్టరేట్‌లో ఏపీఎన్జీవో రాజమహేంద్రవరం నగర శాఖ ప్రచురించిన ఉద్యోగుల కాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో జి.నరసిం హులు, కెఆర్‌ఆర్‌సీ ఎస్‌డీటీ కృష్ణనాయక్, సీపీవోఎల్ అప్పలకొండ, మాస్టర్ ట్రైనర్ ఎస్ఐసీ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్‌ల వేతనాలపై నిర్ణయం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఆర్ రోజువారీ వేతనాలను నిర్ణయిస్తూ కలెక్టర్ మాధవీలత ఆదేశాలిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికులకు నైపుణ్యం కలిగిన వారికి రోజుకు రూ.827, సెమీ స్కిల్డ్ రూ.687, నైపుణ్యం లేనివారికి రూ.560 చొప్పున చెల్లించాలన్నారు. ఈ వేతనాలు 1.4.2023 నుంచి 31.3.2024 వరకూ అమలులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ, పీఆర్ ఎస్ఈ మహ్మద్ అలిముల్లా, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అధరహో!

ఖోఖో గింజల ధర కేక

- కేజీకి రూ.110 పెరుగుదల
- ప్రస్తుతం కేజీ రూ. 350
- గతేడాది రూ. 240
- మరింత పెరిగే అవకాశం
- రైతాంగం ఆనందం
- దిగుబడులు తగ్గడమే కారణం
- జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు
- అనుకూలించని వాతావరణం
- పూత తగ్గిందంటున్న రైతాంగం

పెరవలి,ఫిబ్రవరి 5 : ఖోఖో ధర కేక పెడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పెరగడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. కొబ్బరి తోటలు, పామాయిల్ తోటల్లో అంతర పంటగా జిల్లావ్యాప్తంగా వందలాది ఎకరాల్లో ఖోఖో సాగు చేస్తున్నారు.గతేడాది కేజీ ఖోఖో గింజలు ధర రూ. 240ల వరకు పలకగా ఈ ఏడాది రూ.350లు పలుకుతోంది. రాబోయే రెండు, మూడు నెలల్లో ఈ ధర మరింత పెరగవచ్చునని కూడా చెబుతున్నారు. నాలుగేళ్ల కిందట వరకు రూ.200 లోపు మాత్రమే ధర పలికేది. క్రమక్రమంగా పెరిగి గతేడాది 240 రూపాయలకు చేరుకుంది. గతంలో ఎపుడూ ధర పెరిగిన కేవలం రూ.10 నుంచి రూ. 20 మాత్రమే పెరిగేది. ప్రస్తుతం అలా కాకుండా రూ.50 రూపాయలు చొప్పున పెరుగుతూ వచ్చింది. దీనికి కారణం గత రెండు, మూడు నెలల్లో వచ్చిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో పాటు సరైన దిగుబడిలేక డిమాండ్ పెరిగినట్టు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుత వాతావరణం పరిస్థితుల వల్ల ఖోఖో తోటల్లో పూత దెబ్బతిని ప్రస్తుతం కాపు తగ్గిందని చెబుతున్నారు. సాధారణంగా ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. కొన్ని చోట్ల మాత్రం 6 నుంచి 7 క్విం టాళ్ళ వరకు వస్తుంది. ప్రస్తుతం మారిన పరిస్థితుల వల్ల ఎకరాకు 2.30 క్వింటాళ్ళ నుంచి 3 క్వింటాళ్ళు మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. డిమాండ్ తగిన దిగుబడి లేకపోవడంతో ఒక్కసారిగా ధర పెరి గింది. అంతే కాకుండా ఖోఖో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు వద్ద నిల్వలు లేక ధర పెంచినట్టు చెబుతున్నారు. స్థానికంగా గింజలు కొనుగోలు చేసే క్యాడ్‌బరి కంపెనీకి చెందిన మాండెలిజ్ కంపెనీ గతేడాది జనవరి నెలలో 180 టన్నులు కొనుగోలు చేయగా ప్రస్తుతం 80 టన్ను లు మాత్రమే కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. ధర పెరిగినప్పటికి దిగుబడి తగ్గి రైతుల్లో కొంత నిరాశ కలుగుతుంది.దీంతో ఖోఖో పంటపై రైతు ల్లో ఆశలు చిగురుస్తున్నాయి. కొబ్బరిలో అంతర పంటగా జిల్లాలో అరటి, కూరగాయలు వంటివి పండిస్తుంటారు. గత పది పదిహేను సంవత్సరాలుగా ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల ఖోఖో పంటను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరానికి కొబ్బరి కాయలు దిగుబడితో పాటు అదనంగా ఖోఖో గింజల ఆదాయం కూడా వస్తుండడంతో ఎక్కువ మంది రైతులు ఖోఖో పంటలు వైపు మొగ్గు చూపారు. అయితే ప్రస్తుత ధర ప్రభావం కారణంగా మరింత మంది రైతులు ఖోఖో సాగులో దిగేందుకు సన్నద్ధమవుతున్నారు.

నిరంతరం డిమాండ్..

ఖోఖో గింజలకు డిమాండ్ లేకపోవడం అంటూ ఏమీ ఉండదు. గత కరోనా సమయంలో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఖోఖో గింజల అమ్మకాలు సాగాయి. ఖోఖో గింజలు ద్వారా పిల్లలు ఎంతో ఇష్టంగా తినే చాక్లెట్స్ తయారవుతాయి. అదేవిధంగా ఖోఖో పౌడర్, ఖోఖో మిల్క్, బార్నమిటా, బూస్ట్ తదితర ఉత్పత్తులు ఖోఖోగింజల ద్వారా తయారవుతుంటాయి. అంతే కాకుండా ధరలేకపోతే ఆరబెట్టిన ఖోఖో గింజలను రైతులు రెండు మూడు నెలలు పాటు నిల్వ చేసుకునే సౌలభ్యం ఉంది. దీంతో ఎక్కువ రైతులు ఈ పంట వైపు మొగ్గుచూపుతున్నారు.

దిగుబడి తగ్గి.. పెరిగిన ధర



గతేడాది కేజీ రూ.240లు ధర పలికిన ఖోఖో ఈ ఏడాది ప్రస్తుతం రూ.350కు చేరుకుంది. ఈ ఏడాది దిగుబడి తగ్గడమే ధర పెరుగుదలకు కారణం. రైతులు ఖోఖో పంట వేసుకోవాలని కంపెనీలు ప్రోత్సహిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా మిగిలిన పంట కంటే ఖోఖో పంట గల రైతుల పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

- సుబ్రహ్మణ్యం, కొనుగోలు కంపెనీ ప్రతినిధి

ప్రస్తుతం కాపు తక్కువ..



రెండెకరాల చేలో ఖోఖో పండిస్తున్నా. ఎకరానికి 4 క్వింటాళ్ళ వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం తోటల్లో కాపు తక్కువగా ఉంది. దిగుబడి ఎంత వస్తుందనేది మే నెలాఖరు నాటికి కాని తెలియదు. అయినప్పటికి ఖోఖోగింజల రేటు పెరగడం ఆనందం కలిగిస్తుంది. ఖోఖో తోట వేయడానికి ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి.

- నందమూరి రామారావు, రైతు, తీపర్రు

విజిలెన్స్ ఎస్పీగా సుబ్బారెడ్డి బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ ఎస్పీగా కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రభుత్వానికి రావాల్సిన రెవెన్యూ వసూళ్లలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం, పథకాల అమలులో అవినీతి వంటి వాటిపై దృష్టి సారి స్తామన్నారు.డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తహశీ ల్దారు విజయ్‌కుమార్, ఏవో భార్గవ మహేశ్, ఏజీ లక్ష్మీనారాయణ, సూప రింటెండెంట్ మునిబాబు అభినందనలు తెలిపారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ మాధవీలత,జేసీ తేజ్‌భరత్

కలెక్టర్ స్పందనకు 174 అర్జీలు

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి 5 : స్పందనలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో కలెక్టర్ డాక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ , డీఆర్‌వో జి.నరసింహులు జిల్లా అధికారులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం స్పందనకు 174 అర్జీలు అందాయి. ఆన్‌లైన్‌లో 151, ఆఫ్‌లైన్‌లో 23 అర్జీలు ఉన్నాయి. మండపేటకు చెందిన ఎస్.పురుషోత్తమరావు తన కుమార్తె శ్వేతహాసిని పేరున జి.ఎర్రంపాలెంలో వ్యవసాయ భూమి ఉందని అయితే నెక్కంటి విశ్వేశ్వరరావు అనే వ్యక్తి పేరున తన కుమార్తె పేరున ఒకే ఎల్‌పీ నెంబరు జారీ అయ్యిందని దానిని సరి చేయాలని కోరాడు. రాజమహేంద్రవరానికి చెందిన గన్నమ్మ సరిహద్దు తగాదా సరిచేయాలని వేడుకుంది. లంక భూములు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు తదితర సమస్యలు పరిష్కరించాలని అర్జీలను పెట్టుకున్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీశ్

ఎస్పీ 'స్పందన'కు 31 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జాప్యం లేకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. అర్జీదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యను తెలుసుకు న్నారు. వర్చువల్ విధానంలో ఆయా స్టేషను బాధ్యులు, డీఎస్పీలతో ఫిర్యాదుదారుల సమక్షంలోనే మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. సివిల్, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాటలు తదితర 31 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. చట్ట పరిధిలో సాధ్యమైనంత త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మూడో పట్టణ పోలీస్ స్టేషను పరిధి కృష్ణానగర్‌లో తాము అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని అద్దె విషయంలో తనపై దాడి చేశాడని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. తన 19 ఏళ్ల కుమారుడు 2022లో తప్పిపోగా ఇప్పటి వరకూ కేసులో పురోగతి లేదని కడియం పోలీస్ స్టేషను పరిధి లోని జేగురుపాడుకు చెందిన ఓ వ్యక్తి ఎస్పీకి విన్నవించారు. తనపై హత్యాయత్నం చేశారని బొమ్మూరు పీఎస్ పరిధిలోని హుకుంపేట గ్రామానికి చెందిన ఓ మహిళ, తన వద్ద అప్పుగా తీసుకున్న సొమ్ము తిరిగి ఇప్పించాలని ధవళేశ్వరం పీఎస్ పరిధిలోని రాజవోలుకు చెందిన ఓ వ్యక్తి, అదనపు కట్నం కోసం తనను కుటుంబీకులు వేధిస్తున్నారని కోరుకొండ పీఎస్ పరిధిలోని ఒక మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.ఏఎస్పీ(పరిపాలన) రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.



పులి దాడిలో మృతిచెందిన పందికి సంబంధించి రైతుకు పరిహారం అందజేస్తున్న అటవీ అధికారులు.. దాడి చేసిన పులి

కన్నాపురం అటవీ ప్రాంతం వైపు
పెద్ద పులి పాదముద్రలు

- పాపికొండల అభయారణ్యంలోకి వెళ్లే అవకాశం
- 9 గంటల వరకూ పొలం పనులకు వెళ్లవద్దని సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే : అటవీ అధికారి

గోపాలపురం, ఫిబ్రవరి 5 : పెద్దపులి ప్రస్తుతం గోపాలపురం మండలం కరగపాడు అటవీప్రాంతం నుంచి ఏలూరు జిల్లా కొవ్వాడ రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ప్రవేశించిందని రాజమహేంద్రవరం అటవీశాఖాధికారి ధనరాజు తెలిపారు. గోపాలపురం మండలం కరగపాడు అటవీ ప్రాంతంలో పందిపై దాడి చేసిన ప్రాంతాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం పెద్దపులి పాదముద్రలు కన్నాపురం అటవీప్రాంతం వైపు ఉన్నాయన్నారు. అటు నుంచి పాపికొండల అభయారణ్యంలోకి పులి చేరవచ్చని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కొన్ని రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం 9 గంటల వరకు పొలం పనులకు వెళ్లవద్దని సూచించారు.పొలంలోని పశువులను ఇళ్ళ వద్దకు తీసుకురావాలని 5గంటలు దాటిన తరువాత ప్రజలు ఇళ్ళకే పరిమితం కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పులిదాడిలో చనిపోయిన పందికి సంబంధించి రైతుకు నష్టపరిహారం కింద రూ.4 వేలు అందజేశారు. చనిపో యిన పందికి అంత్యక్రియలు జరిపించినట్టు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ ఆర్వో వేణుగోపాల్, ఎఫ్‌డీవో కార్తీక్ తదితరులు ఉన్నారు.



చెట్టుకు.. చేటు : చిడిపి గోదావరి లంకలో ముక్కలైన భారీ వృక్షాలు

తవ్వేయ్.. నరికెయ్!

చిడిపి గోదావరి లంకలో మట్టి.. చెట్లూ మాయం

కొవ్వూరు, ఫిబ్రవరి 5 : అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు.. ఎవరైనా వస్తే రానీ మామూళ్లిస్తాం.. మాట్లాడి పంపిస్తాం.. ఇదీ వైసీపీ ప్రభుత్వంలో చాలా మంది నాయకుల తీరు.. దర్జాగా అక్రమార్జనకు తెగబడుతున్నారు.. అధికారుల అండదండలతో ఎటువంటి భయమూ లేకుండా పగలూ రాత్రీ కూడా తాము అనుకున్నది చేసేస్తున్నారు. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. కొవ్వూరు మండలం చిడిపి గ్రామ రెవెన్యూ పరిధిలో అఖండ గోదావరి మధ్య లంకలలో చాలా ఏళ్లగా విలువైన మట్టి, కలప ఉంది. గతంలో ఆ ప్రాంతంలో అడుగుపెట్టాలంటేనే భయపడేవారు. అటువంటిది నేడు ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలించుకుపోతున్నారు.. చెట్లను కొట్టుకుపోతున్నారు. అయినా అడిగే నాథుడు లేడు.. ప్రశ్నించే పాలకుడు లేడు. గోదావరి మధ్య భాగంలో సుమారు 200 ఎకరాల లంక భూమి ఉంది. 2023 నవంబరులో చిడిపి గ్రామ దళితులకు ఒక్కొక్కరికి 65 సెంట్లు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం లీజుకు పట్టాలు మంజూరు చేసింది. ఆ భూములను ఆనుకుని ఇంకా మిగిలి ఉన్న 140 ఎకరాల లంకభూమిలో వేమ, చీమచింత, తుమ్మ జాతికి చెందిన పెద్దపెద్ద వృక్షాలు ఉన్నాయి. ఆ భూముల్లో మట్టిని వ్యవసాయ భూములు మెరక చేసుకోవడానికి, ఇటుక బట్టీలకు విక్రయించి అక్రమార్జన చేస్తున్నారు. చెట్లను నరికివేసి ట్రాక్టర్లలో స్మగ్లింగ్ చేస్తూ లక్షలాది రూపాయలు ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నారన్నారు. దళితులకు చెందిన లంకభూముల్లో మట్టి, కలపను (అటవీ శాఖ, నీటిపారుదల, రెవెన్యూ, గనులు, పర్యావరణ శాఖల) అనుమతులు లేకుండా దోచుకుంటున్నారు. అక్రమంగా చెట్లు నరికి అక్రమార్జన చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చిడిపి గ్రామస్తులు జిల్లా కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో చిడిపి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కవల శ్రీనుబాబు, కొయ్య వెంకట్రావు, డి.వెంకటరత్నం, కె. దుర్గాప్రసాద్ సోమవారం జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పామెర్ల నగేష్, అఖండ గోదావరి కుడిగట్టు విభాగం (ఏజీఆర్‌బీ) ఏఈ సునీల్‌కుమార్ కుమ్మక్కై లంకభూములలో ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను నరికి అక్రమంగా కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. కోట్లాది రూపాయలు ప్రభుత్వ సంపదను కొల్లగొడుతూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ఇరువురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అఖండ గోదావరి కుడిగట్టు విభాగం(ఏజీఆర్‌బీ) ఏఈ సునీల్‌కుమార్‌ను ప్రశ్నించగా దళితులు జంగిల్ క్లియరెన్స్ చేసుకుంటున్నారని చెప్పడం గమనార్హం.

వైసీపీ నాయకులు..అధికారుల దందా?

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కొవ్వూరు రూరల్ సీఐగా శ్రీనివాసరావు

ఎస్ఐగా సుధాకర్



సీఐ శ్రీనివాసరావు ఎస్ఐ సుధాకర్

కొవ్వూరు, ఫిబ్రవరి 5: కొవ్వూరు రూరల్ సీఐగా పి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కొవ్వూరు రూరల్ సీఐగా పనిచేస్తున్న వైవీ రమణ మచిలీపట్నం ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న పి.శ్రీనివాసరావు వచ్చారు. అలాగే కొవ్వూరు రూరల్ ఎస్ఐగా కె.సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణా జిల్లా కంకిపాడు నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం, తుని రూరల్, ఏలేశ్వరం, ప్రత్తిపాడు స్టేషన్లలో పనిచేశానన్నారు. ఇప్పటివరకు కొవ్వూరు రూరల్ ఎస్‌గా పనిచేసిన జి.సతీష్ ఏలూరు జిల్లా ద్వారాకా తిరుమలకు బదిలీపై వెళ్లారు.

నిడదవోలు తహశీల్దార్‌గా నాగభూషణం



నిడదవోలు, ఫిబ్రవరి 5: నిడదవోలు మండల తహశీల్దార్‌గా వి.నాగభూషణం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన కృష్ణా జిల్లా పెదపారిపూడి నుంచి నిడదవోలు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఎమ్.గంగరాజు రాజమహేంద్రవరం రుడా సెక్రటరీగా బదిలీ అయ్యారు. అలాగే ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్‌గా గోపాల పురం నుంచి నిడదవోలుకు కేయూ శ్రీనివాస్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

దేవరపల్లి తహశీల్దార్‌గా ఆచారి



దేవరపల్లి, ఫిబ్రవరి 5: దేవరపల్లి తహశీల్దార్‌గా వైవీఎస్ ఆచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లూరి జిల్లా రాజవొమ్మంగి నుంచి బదిలీపై దేవరపల్లి వచ్చారు. ఇప్పటివరకూ దేవరపల్లిలో పనిచేసిన ఎం.రామకృష్ణ కృష్ణాజిల్లా కంకిపాడు తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో 67 పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటిని పరిశీలిస్తానని, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటానని చెప్పారు.

చాగల్లు తహశీల్దార్‌గా సావిత్రి



చాగల్లు, ఫిబ్రవరి 5: చాగల్లు మండల తహశీల్దార్‌గా ఎం.సావిత్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇప్పటివరకు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఆఫీసులో ఏవోగా బాధ్యతలు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చాగల్లు తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించిన కె.రాజ్యలక్ష్మి ఏలూరు జిల్లా కోయలగూడెం తహశీల్దార్‌గా వెళ్లారు.

ఎంపీడీవోగా బుజ్జి



చాగల్లు మండల ఎంపీడీవోగా నాతి బుజ్జి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇప్పటివరకూ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. చాగల్లులో ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న నిర్మలకుమారి యథావిధిగా సూపరింటెండెంట్‌గా కొనసాగుతారు. ఈ సందర్భంగా బుజ్జిని కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనాలు తెలిపారు.

గోపాలపురం తహశీల్దార్‌గా వనజాక్షి



గోపాలపురం, ఫిబ్రవరి 5: గోపాలపురం తహశీల్దార్‌గా డి.వనజాక్షి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈమె కృష్ణా జిల్లా ఉంగుటూరు మండల తహశీల్దార్‌గా పనిచేసి ఎన్నికల బదిలీల్లో భాగంగా గోపాలపురం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు రెవెన్యూ సిబ్బంది, ఎలక్షన్ డీటీ ఎస్.కృష్ణ పుష్పగుచ్ఛి స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఇక్కడ తహశీల్దార్‌గా పని చేసిన రవీంద్రనాథ్ బదిలీపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

పెరవలి ఎంపీడీవోగా హిమమహేశ్వరి



పెరవలి, ఫిబ్రవరి 5: పెరవలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నియమితులైన కె.హిమ మహేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనపర్తి ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కార్యాలయ సీఈవో రమేష్, ఇతర సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

తాళ్లపూడి తహశీల్దార్‌గా శ్రీనివాసరావు



తాళ్లపూడి, ఫిబ్రవరి 5: తాళ్లపూడి తహశీల్దార్‌గా సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం నుంచి తాళ్లపూడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ టి.రాధిక జిల్లా సివిల్ సప్లైస్ డీఎంగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌గా శ్రీనివాసరావుకు రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భారతి, ఆర్ఐ కిషోర్, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, సర్వేయర్ వీరాస్వామి తదితరులు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.

కోట సత్తెమ్మ ఆలయంలో ఐఏఎస్ అధికారి వాణీమోహన్ పూజలు



అమ్మవారి జ్ఞాపికను స్వీకరిస్తున్న ఐఏఎస్ ఆఫీసర్ వాణీమోహన్

నిడదవోలు, ఫిబ్రవరి 5: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మను సోమవారం పలువురు అధికార్లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ ఆర్కియాలజి మ్యూజియం కమిషనర్ జి.వాణీమోహన్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాస్, సమిశ్రగూడెం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఎస్‌వీవీ రమేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరితో ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా ఈవో బళ్ల నీలకంఠం, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకట కృష్ణ అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

వరప్రసాద్‌కు ఉత్తమ రైతు సేవకుడి అవార్డు



అవార్డు అందుకుంటున్న వరప్రసాద్

కొవ్వూరు, ఫిబ్రవరి 5: మండలంలోని కుమారదేవం గ్రామానికి చెందిన జువ్విరెడ్డి వరప్రసాద్ 2023 సంవత్సరానికి ఉత్తమ రైతు సేవకుడి అవార్డు అందుకున్నారు. సోమవారం అమరావతి సెక్రటేరియేట్‌లో జరిగిన సమావేశంలో వరప్రసాద్‌ను వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్దన్‌రెడ్డి అవార్డు, రూ.2 లక్షల నగదు బహుమతితో సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి, నాబార్డు సీజీఎంఎంఆర్ గోపాల్, డీడీఎంలు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు గిరిజనుల వారసత్వ సంపద



యూనవర్సిటీ ప్రధాన ద్వారం నుంచి కళారూపాల ప్రదర్శన

- నన్నయ వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్
- జాతీయస్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు
- రెండు రోజుల పాటు కళా ప్రదర్శనలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 5: సంస్కృతీసంప్రదాయాలు, సంస్కారాలు గిరిజనుల వారసత్వ సంపద అని, వాటిని వారి నుంచి నేర్చుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్శిటీ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మరో ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు కళలలోనే సమాజ వికాసం ఇమిడి ఉంటుందన్నారు. టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు రెండు రోజులపాటు జరుగుతాయని, ఏపీతో బాటు తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి కళాకారులు వచ్చారన్నారు. కళాకారులు థింసా, తప్పెటగుళ్ల వంటి 35 గిరిజన కళారూపాలను ప్రదర్శిస్తారన్నారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలో అంతరించిపోతున్న జాతుల్లో ముఖ్యంగా గిరిజన జాతి ఉందని, ఈ ఆదివాసీ ఆచార సాంప్రదాయాలు, కళలను కాపాడుకోవలసిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతరించిపోతున్న గిరిజన సంస్కృతీసాంప్రదాయాలను కాపాడాలని కోరారు. తమ సంప్రదాయ నృత్యాలు, కళలను కాపాడుకునే సమష్టి బాధ్యతలో భాగంగానే ఈ ఉత్సవాలు ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన జాబితాలో ఇతర కులాలను చేర్చాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నన్నయ వర్శిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కె.ఉపేంద్రరెడ్డి, టీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.విష్ణునాయక్, తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌నాయక్, నాయకులు రాజకుమార్‌రెడ్డి, భగవాన్, వెస్లీ, రఘు, రామరాజు, వెంకటేష్, వెంకటేశ్వర్లు నాయక్, రఘునాథ్‌నాయక్, మల్లేష్ పాల్గొన్నారు. ఈ ప్రదర్శనల్లో కొందరు విశ్వవిద్యాలయ అధికార్లు కూడా కొద్దిసేపు కళాకారులతో కలసి నృత్యాలు చేశారు. తొలుత యూనివర్సిటీ ప్రధాన ద్వారం నుంచి సభ జరిగే భవనం వరకూ కళారూప ప్రదర్శనలతో ఊరేగింపు నిర్వహించారు.



మహిళా కళాకారిణుల నృత్యప్రదర్శన


ప్రతి ఓటుపైనా అవగాహన ఉండాలి

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి
- క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులకు సమగ్ర శిక్షణ తరగతులు

అనపర్తి, ఫిబ్రవరి 5: నియోజకవర్గంలోని ప్రతి ఓటుపైనా టీడీపీ బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటరు సవరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగక పోవడంతో ఓటరు జాబితా అస్తవ్యస్తంగా మారిందని, ఓటరు జాబితాపై నాయకులు దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించి ఇంటిగ్రేటెడ్ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇప్పటికే ఎన్నికలు సమీపించాయని, ప్రతిఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే ఎన్నికల సమయానికి పని ఒత్తిడి తగ్గుతుందన్నారు. అలాగే గ్రామాల్లో నాయకులు ప్రతి ఓటరును కలిసి వైసీపీ అవినీతి పాలనను వివరిస్తూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువచేసి ఓటు అడగాలన్నారు. వచ్చే 60 రోజులు ఎంతో కీలకమని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులుతో బాటు ఆళ్ల గోవిందు, జుత్తుగ కృష్ణ, వెలుగుబంటి సత్తిబాబు, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, మామిడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో ప్రసంగిస్తున్న రామకృష్ణారెడ్డి



గోకవరం: తంటికొండలో టీడీపీలో చేరిన వారితో జ్యోతుల నవీన్

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : జ్యోతుల నవీన్

గోకవరం, ఫిబ్రవరి 5: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన సుమారు 50 మంది వైసీపీ కార్యకర్తలు సోమవారం టీడీపీలో చేరారు. వారికి నవీన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో నవీన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమర్థుడైన నాయకుడని, ఆయనను ఎమ్మెల్యేను చేయాలనే ఉద్దేశంతోనే గోకవరం మండలం నుంచి టీడీపీలోకి చేరికలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పార్టీలోకి ఎంతమంది వచ్చినా వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బదిరెడ్డి అచ్చన్నదొర, పూలపల్లి కృష్ణ, డీవీవీ సీతారాం, గాజింగం సత్తిబాబు, బదిరెడ్డి రవి, పెద్దాడ వెంకన్నదొర పాల్గొన్నారు.

జాతీయ రహదారి వెడల్పును కుదించాలి

- 'స్పందన'లో దొండపూడి గ్రామస్థుల ఫిర్యాదు
- డివిజనల్ స్పందనకు 10 అర్జీలు : సబ్‌కలెక్టర్

కొవ్వూరు, ఫిబ్రవరి 5: కొవ్వూరు నుంచి జీలుగుమిల్లి వరకు నిర్మిస్తున్న 265 జాతీయ రహదారి వెడల్పును దొండపూడిలో 23 మీటర్ల నుంచి 18 మీటర్లకు కుదించాలని కోరుతూ దొండపూడి గ్రామస్థులు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన డివిజనల్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఎం.రాజేష్, ఎం.అచ్చిబాబు, వెన్ను వెంకట్రావు, పోతిరెడ్డి నాగరాజు మాట్లాడుతూ దొండపూడిలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, రోడ్డు విస్తరణతో ఉపాధి కోల్పోతామన్నారు. 2017 నుంచి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని, అధికారులు గ్రామంలోని ప్రజల నివాసానికి, ఉపాధికి ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారని, అయితే ప్రస్తుతం రహదారి విస్తరణలో భాగంగా సర్వే చేపట్టి గ్రామంలో ఇంకనూ 12 ఎకరాలు భూమిని సేకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీంతో ఉపాధి కోల్పోతామని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదుచేశారు. కాగా డివిజనల్ స్పందనలో 10 ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ శ్రీవాత్సవకు ఫిర్యాదు చేస్తున్న దొండపూడి గ్రామస్థులు

తిలక్ కుటుంబానికి జవహర్ పరామర్శ

తాళ్లపూడి, ఫిబ్రవరి 5: మండలంలోని మలకపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, న్యాయవాది రాపాక బాలగంగాధర్ తిలక్ మృతి పట్ల సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ నివాళులర్పించి అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మద్దిపాటి ప్రకాశం, మద్దిపాటి రామారావు, తిగిరిపల్లి గోపి, చెరుకూరి వెంకట్రావు, గెద్దం జగన్, జాన్, నరసయ్య, రాజేష్ పాల్గొన్నారు.

'మల్లిపూడి' ఆర్థిక సాయం

చాగల్లు, ఫిబ్రవరి 5 మండలంలోని బ్రాహ్మణగూడెంలో ఇటీవల కుటుంబ యజమానిని కోల్పోయిన కుటుంబానికి మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు తరుపున ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబంలోని ఇద్దరు చిన్నారులకు ప్రతి నెల ఆర్థిక సహాయం చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ట్రస్టు ప్రతినిధి ధనరాజు, స్థానిక నాయకులు ఎం.రాజేశ్వరరావు, సిర్రా వంశీ, రాపాక కేశవ్ బర్రె శేఖర్, రాజేష్, వెంకటరావు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ మంత్రి వివేకానంద



కొవ్వూరు, ఫిబ్రవరి 5: మాజీ మంత్రి కారుపాటి వివేకానంద బీజేపీలో చేరారు. సోమవారం కొవ్వూరు పీఆర్ఆర్ కల్యాణ మండపంలో ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. రాధ మాట్లాడుతూ వివేకానంద 1983, 85, 89 ఎన్నికల్లో గోపాలపురం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణా .ధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, గెల్లా కేశవ, కొండపల్లి రత్నసాయి, ఎం.వీరాంజనేయులు, జి.శివకృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారంతో సైకిల్ షెడ్డు

చాగల్లు, ఫిబ్రవరి 5: మండలంలోని ఊనగట్ల హైస్కూల్ 1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆర్థిక సహకారం(రూ.60 వేలు)తో పాఠశాలలో సైకిల్ షెడ్డు నిర్మించారు. దీనిని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గ్రామపెద్దలు నల్లూరి ధర్మరాజు, నందిగం శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల నిలిపివేత దారుణం

జనసేన నిడదవోలు అధ్యక్షుడు రమేష్.. మౌన రిలే దీక్ష



తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష నిర్వహిస్తున్న జనసేన నాయకులు

నిడదవోలు, ఫిబ్రవరి 5: తెలుగుదేశం ప్రభుత్వం పేదలకు నిర్మించిన టిడ్కో గృహాలు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లబ్ధిదారులకు అందించకుండా నిలిపివేయడం దారుణమని జనసేన పట్టణాధ్యక్షుడు రంగా రమేష్ అన్నారు. సోమవారం నిడదవోలులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మౌన రిలే నిరవధిక దీక్ష నిర్వహించారు. సాయంకాలం టీడీపీ నాయకుడు బూరుగుపల్లి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు పాలా వీరాస్వామి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ త్వరలోనే టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, టిడ్కో గృహాల లబ్ధిదారుల సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనగా ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు.

పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి అభినందన సభ



గోపాలపురం, ఫిబ్రవరి 5: విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా, అంకితభావంతో పని చేసి రాఘవరెడ్డి అందరి మన్ననలు పొందారని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 38 ఏళ్ల పాటు పంచాయతీ కార్యదర్శిగా సేవలందించిన వింతా వీరరాఘవరెడ్డికి అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు, రాజకీయ నాయకులు, సచివాలయ సిబ్బంది సత్కరించారు.

ఇద్దరికి తెలుగు భాష సేవారత్న పురస్కారాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: జిల్లాకు చెందిన ఇరువురికి తెలుగు బాషా సేవారత్న పురస్కారాలు లభించాయి. గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అందజేశారు. అధికార భాషా సంఘం, నాగార్జున విశ్వవిద్యాలయం ప్రవాసాంధ్ర తెలుగు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పత్రికా రంగంలో, తెలుగు బాషా సాహిత్యానికి విశేష సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ వీఎస్ఎస్ కృషకుమార్, రచయిత చిలుకూరి శ్రీనివాసరావులకు అవార్డులను ప్రకటించారు.

అభివృద్ధి ముసుగులో ఎంపీ తెలివైన వ్యాపారం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: అభివృద్ధి ముసుగులో ఎంపీ భరత్ రామ్ తెలివైన వ్యాపారం చేశాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. రాజమండ్రి జేఎన్ రోడ్డులోని వెంకటేశ్వరా నగర్ వాకర్స్ పార్కు వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాసులకు కక్కుర్తిపడి, కమిషన్లకు అల వాటు పడిన ఎంపీ భరత్ నగర ప్రతిష్టను మంటగలిపాడని మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన సుబ్రహ్మణ్యమైదానంలో బ్లేడుబ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లు ,అల్లరి చిల్లరగా తిరిగేవాళ్ళు ఉన్నారని భరత్ రామ్ అని దానిని అందుకోసమే ఓపెన్ ఆడిటోరియం స్క్రీన్ ఏర్పాటు చేశామనడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. తన వ్యాపారాన్ని పెంచుకునేందుకు ప్రతి సమావేశం సభ తన మార్గాని ఎస్టేట్‌లోనే పెట్టుకునే విధంగా భవిష్యత్ వ్యాపారం కోసం నగరంలో ఉన్న ఖాళీ స్థలాల్లో అభివృద్ధి పేరుతో ఎంపీ భరత్ రామ్ నిర్మాణాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. నగరంలో చేపడుతున్న పనులన్నీ నాణ్యత లోపంతో జరిగాయన్నారు.

ఎంపీ సిఫార్సుతో ఏపీపీ నియామకం సరికాదు

టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: న్యాయవ్యవస్థ ప్రతిష్ట కు భంగం కలిగేలా వివాదాల్లోను, పోలీసు కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తులకు కోర్టులో నియామకానికి ఎంపీ భరత్ రామ్ సిఫార్సు చేయడం సరైన విధానం కాదని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో మూడు కేసుల్లో ఉన్న కోడి సతీష్ నాయుడుని ఎంపీ భరత్ రామ్ సిఫార్సుతో ప్రిన్సిపల్ అసిస్టెంట్స్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారని ఇప్పుడు ప్రభుత్వమే ఆయన ప్రవర్తనతో పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. టీడీపీ లీగల్ సెల్ నగర అధ్యక్షుడు నామా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొమ్మర్తి బాబ్జి మాట్లాడుతూ ఎంపీ భరత్ కార్పొరేటర్‌కు ఎక్కువ ఎమ్మెల్యేకు తక్కువ అని మండిపడ్డారు.

'ప్రత్యేక హోదా తెచ్చేది కాంగ్రెస్ పార్టీయే'

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేది ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ రాజమహేంద్రవరం అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. రాజమహేంద్రవరం నగర కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాంతీయ పార్టీలతో రాష్ట్రానికి ప్రత్యేకహోదా రాదన్నారు. సమావేశంలో ముళ్ళ మాధవ్, భాగ్యసూర్యలక్ష్మి, చింతాడ వెంకటేశ్వరరావు, చామర్తి లీలావతి, బత్తిన చంద్రరావు, యిజ్జరౌతు విజయలక్ష్మి, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

13 వరకూ లెప్రసీ అవగాహన కార్యక్రమాలు

జిల్లా లెప్రసీ నివారణాధికారిణి డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం అర్బన్/కడియం, ఫిబ్రవరి 5: మహాత్మాగాంధీ వర్థంతి సందర్భంగా జనవరి 30వ తేదీ నుంచి ప్రారంభమైన స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమం ఈ నెల 13వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ నివారణాధికారిణి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. రాజమహేంద్రవరం ఇమ్మానుయేల్ లెప్రసీ కాలనీ, కడియం మండలం చైతన్యనగర్‌లో సోమవారం యాంటీ లెప్రసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం లెప్రసీ బాధితులకు దుప్పట్లు, టవళ్లు, మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నా భోజనం అందించారు. కార్యక్రమాల్లో పీహెచ్‌సీ డాక్టర్ మౌర్య, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ టీమ్ డీపీఎంవో జోగేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారులు ఎంబీవీ రామకృష్ణ, ఎండీ ఆలీబేగ్, నర్సింగ్‌స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ రోడ్డు ప్రమాదంలో

సీపీ రెడ్డి హీరో షోరూం అధినేత తనయుడి మృతి



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజమహేంద్రవరానికి చెందిన సీపీ రెడ్డి హీరో మోటార్స్ షోరూం అధినేత చింతా ప్రసాద్ రెడ్డి తనయుడు చింతా నాగప్రణవ్ రెడ్డి (24) మృతిచెందారు. రాజమహేంద్రవరానికి చెం దిన సీపీ రెడ్డికి కుమారుడు నాగప్రణవ్ రెడ్డి , కుమార్తె ఉన్నారు. విశాఖపట్నం గీతమ్స్ కళాశాలలో ప్రణవ్ రెడ్డి ఎంబీఏ చదువుతున్నాడు. కొద్ది రోజుల కిందట సెలవులకు రాజమహేంద్రవరం వచ్చిన ప్రణవ్ ఇటీవల తిరిగి విశాఖ వెళ్ళాడు. ఆదివారం రాత్రి రుషికొండ నుంచి తన బైక్‌పై వెళుతుండగా ఎదురుగా బుల్లెట్‌పై అతివేగంగా ఇద్దరు యువకులు వచ్చి ఢీకొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రణవ్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. నాగప్రవణ్‌రెడ్డి పార్థివదేహాన్ని సోమవారం రాజమహేంద్రవరంలోని దానవాయిపేట ఇంటికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. జక్కంపూడి విజయలక్ష్మి, టీకే విశ్వేశ్వరరెడ్డి, స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, అజ్జరపు వాసు, గంటా సునీల్, వ్యాపార వేత్తలు, ప్రముఖులు ప్రణవ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. సీపీ రెడ్డి కుటుంబీకులను ఓదార్చారు.